తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక


భారత్, రష్యా బంధం బలోపేతం చేయాలి

దేశ మొట్టమొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ రష్యాతో సత్సంబంధాలు కొనసాగించి దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించారని మంత్రి సీతక్క అన్నారు. వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ హైదరాబాద్ కార్యాలయాన్ని మంత్రి సీతక్క సోమాజిగూడలోని హోటల్ కత్రియలో వర్చువ ల్గా ప్రారంభించారు. రష్యాకు, భారతదేశానికి ఉన్న బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ పనిచేయాలని సూచించారు. రష్యా, భారత్ బంధం ఇప్పటిది కాదని, నెహ్రూ, ఇందిరాగాంధీ ఉన్నప్పటి నుంచీ కొనసాగుతుందని అన్నారు. మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సంస్థకు ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని తెలిపారు. సంస్థ ఇండియా హెడ్ డాక్టర్ రాయల నీతు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 259 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | శుక్రవారం, ఆగస్టు 07, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు

నియోజకవర్గాల పునర్విభజనపై ముందుకే రాహుల్‌తో కేంద్ర మంత్రి రిజిజు ప్రత్యేక భేటీ తమ రెండు డిమాండ్లపై తగ్గేది లేదన్న విపక్ష నేత



దిల్లీ: మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయనుంది. దీనిలో భాగంగానే ప్రధాన విపక్షం కాంగ్రెస్‌తో సంప్రదింపులు ప్రారంభించింది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు వచ్చి తమ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని విపక్షాలు పట్టువిడవకుండా ఆందోళన చేస్తున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీతో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం సుమారు 50 నిమిషాలసేపు భేటీ అయ్యారు. కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. బిల్లులు ఆమోదం పొందడానికి సహకరించాలని రిజిజు వారికి విజ్ఞప్తి చేశారు. దిల్లీలో ఉద్యమించిన విద్యార్థులపై హింస విషయంలో పార్లమెంటులో అమిత్ షా ప్రకటన చేయాలని, అయోధ్యలో విరాళాల చోరీపై చర్చ జరగాలని రాహుల్ స్పష్టంచేశారు. ఈ డిమాండ్లపై రాజీపడేదే లేదని తెగేసి చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఆయన నుంచి రిజిజుకు ఎలాంటి హామీ లభించలేదని తెలుస్తోంది. పునర్విభజన అంశంపై విపక్ష వైఖరి ఏమిటనేది మంత్రి తెలుసుకోగోరారు. రాహుల్‌తో రిజిజు భేటీ కావడం గత పదిరోజుల్లో ఇది రెండోసారి.

ప్రతి రాష్ట్రంలోనూ 50% సీట్లు పెంపు

పార్లమెంటులో సంఖ్యాపరంగా కీలకమైన సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే నేతలతోనూ ప్రభుత్వం మాట్లాడనుంది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి మూడింట రెండొంతుల మంది మద్దతు అవసరం. జనాభాతో సంబంధం లేకుండా ప్రతి రాష్ట్రంలో 50% చొప్పున సీట్లు పెంచేలా కొత్త నిబంధనను బిల్లులో చేర్చే అవకాశం ఉంది. గతసారి ప్రత్యేక సమావేశాల్లో 2/3వ వంతు బలం సమీకరించుకోవడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత అధికార కూటమి బలం గణనీయంగా పెరిగింది. వర్షాకాల సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపించినా అలాంటిదేమీ లేదని ప్రభుత్వం బుధవారం రాత్రి స్పష్టం చేసింది.

బ్యాంకర్స్ బుక్ బిల్లుకు ఆమోదం

బుధవారమూ లోక్‌సభలో నిరసనలు, అవాంతరాలు కొనసాగాయి. బ్యాంకింగ్ వ్యవస్థకు సంబంధించిన డిజిటల్ రికార్డులనూ న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా తీసుకోవచ్చని చెప్పే 'బ్యాంకర్స్ బుక్ ఎవిడెన్స్ బిల్లు- 2026'ను గందరగోళం మధ్య మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. 1891 నాటి చట్టం బదులు దీనిని తీసుకువచ్చారు. బ్యాంకర్స్ బుక్ అంటే భౌతిక పుస్తకాలే కాకుండా ఎలక్ట్రానిక్, డిజిటల్, క్లౌడ్ ఆధారిత పత్రాలు అని నిర్వచనాన్ని మార్చారు.

జిల్లా కోర్టుల్లో 4.98 కోట్ల కేసులు: మేఘ్‌వాల్

సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల మొత్తం సంఖ్యను 38కి పెంచే బిల్లును రాజ్యసభ ఆమోదించింది. బిల్లుపై చర్చకు న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ సమాధానమిస్తూ- హైకోర్టుల్లో 64 లక్షలు, జిల్లా కోర్టుల్లో 4.98 కోట్ల కేసులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు దక్షిణాది రాష్ట్రాల బెంచ్ ఏర్పాటు డిమాండ్లపై ఇప్పటివరకు సర్వోన్నత న్యాయస్థానం నుంచి ఆమోదం రాలేదని చెప్పారు.

ఆగస్టు 15 నుంచి రేషన్ కార్డులు

డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు



హైదరాబాద్, ఆగస్టు 6, (న్యూస్ పల్స్): తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్‌తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్‌కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

ధర్మసాగర్ పల్లి గ్రామ నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



కోహెడ : కోహెడ మండలం ధర్మసాగర్ పల్లి గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ వంచాయతీ భవనాన్ని ప్రారంభించిన రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, హుస్నాబాద్ ఆర్డిఓ రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్, సర్పంచ్ కరివేద చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ మాలోతు రవీందర్,ఇతర ముఖ్య నేతలు,అధికారులు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. గౌరవెల్లి ప్రాజెక్ట్ కి సంబంధించి 250 కోట్లు కాలువల భూసేకరణ కి విడుదల చేయడం జరిగిందిరైతులు కాలువల భూసేకరణ కి సహకరించాలి గౌరవెల్లి ప్రాజెక్ట్ పై న్యాయ పరమైన చిక్కులు తొలగిపోయాయి. గౌరవెల్లి కుడి ఎడమ కాలువలకు సంబంధించి డిస్ట్రిబ్యూట్ కెనాల్ కి సంబంధించి ప్రభుత్వం ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తుందిగౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసే బాధ్యత నాది..ఈ ప్రాంత రైతాంగానికి ఈ ప్రాజెక్ట్ సాగు నీటికి ఎంతగానో ఉపయోగపడుతుంది.కోహెడ తంగలపల్లి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు వేగంగా జరుగుతున్నాయిబోర్ వెల్ రీఛార్జి పాయింట్స్ పెంచుకోవడం,ఆయిల్ ఫామ్ సాగు పెంచుకునే గ్రామాలకు 5 లక్షల చొప్పున ప్రోత్సాహం అందిస్త గ్రామ అభివృద్ధికి సహకరిస్తా.

ఆచార్య జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నివాళ్లు అర్పించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



సిద్దిపేట : ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతుతెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. జయశంకర్ జీవితాంతం తెలంగాణ కోసం పోరాడిన మహనీయులు ఆయనకు సిద్దిపేటతో అవినావభవ సంబంధం ఉంది సిద్దిపేటలో అమరవీరుల స్తూపం ఆయన చేతుల మీదుగానే శంకుస్తపాన చేసుకున్నాం. తెలంగాణ రాష్ట్ర సాధన కేసీఆర్ తోనే సాధ్యమని నమ్మి ఆయనతోనే వెన్నుదన్నుగా ఉన్నారు జయశంకర్ వ్యక్తి కాదు శక్తి రాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ చరిత్ర పుటలలో నిలిచిపోతుంది. ఇవాళ రాష్ట్రం సాధించామంటే అది జయశంకర్ సార్, కేసీఆర్ పోరాటం వల్లనే.. పదేళ్లలో కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆత్మ గౌరవాన్ని అద్భుతంగా నిలబెట్టారు కానీ ఇప్పుడు తెలంగాణ సోయిలేని వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నాడు. అందుకే ఇప్పుడు నదీ జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నదితెలంగాణ కోసం ఉద్యమం చేసి, పోరాడి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 3 ఏండ్లు అయినా ఒక్క ప్రాజెక్టుకు అనుమతులు సాధించలేదు. ఇప్పుడు ఆ అనుమతులను రద్దు చేసే పరిస్థితి వచ్చిందిజిఆర్ ఎంబి ఏజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను అడ్డుకోవాలని చేర్చడం ఇదే మొదటి సారిఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం.ఇప్పటికైనా జీఆర్ఎంబీ ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపాదనలను అడ్డుకోవాలిఆంధ్రప్రదేశ్ కడుతున్న బనకచర్ల ప్రాజెక్టును ఎందుకు ఆపలేకపోతున్నారుసమ్మక్కసాగర్ కు కేటాయించిన నీటిని ఎందుకు వదులుకుంటున్నరు.తెలంగాణ ప్రయోజనాలను కాపాడటానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలిజయశంకర్ కి నిజమైన నివాళులు అర్పించడం అంటే మన నీటి వాటాను మనం కాపాడుకోవాలి.

ఉద్యమ స్ఫూర్తిని జనంలో రగిలించిన గొప్ప మేధావి జయశంకర్ సార్ – కవిత

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా జీవితం మొత్తం అంకితభావంతో పని చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొనియాడారు. జయశంకర్ సార్ జయంతి నేపథ్యంలో అయనకు నివాళులర్పించారు.

కవిత మాట్లాడుతూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను నిరంతరం ప్రశ్నిస్తూ, తెలంగాణ రాష్ట్ర అవసరాన్ని నొక్కి చెప్పేవారు. తెలంగాణ ప్రజలు ఆత్మగౌరవంతో తమను తాము పాలించుకోవాలని పరితపించేవారు. ఆ క్రమంలోనే ఎల్లప్పుడూ ఉద్యమ స్ఫూర్తిని జనంలో రగిలించిన గొప్ప మేధావి ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులని అన్నారు.

సాధించిన తెలంగాణలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కాలని, సామాజిక తెలంగాణ కావాలన్న వారి ఆశయాన్ని స్ఫూర్తిగా తీసుకొని, సామాజిక తెలంగాణ సాధనకై తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని అన్నారు.

కోహడ మార్కెట్ యార్డ్ లో మంత్రి పొన్నం పర్యటన

హుస్నాబాద్ : కోహెడ మార్కెట్ కమిటీ లో 1,61 కోట్ల రూపాయలతో ఓపెన్ షెడ్ , ఫ్లాట్ ఫారం , మీటింగ్ హాల్ నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేసారు. తరువాత మార్కెట్ యార్డు ఆవరణలో వన మహోత్సవం లో భాగంగా మొక్కలు నాటారు.।

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ , మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మల జయరాజ్ ,వైస్ చైర్మన్ భీంరెడ్డి తిరుపతి రెడ్డి , సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు , ఇతర ముఖ్య నేతలు ,అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 07, 2026

రిజర్వేషన్లు లేని సమాజం సాధ్యమా..

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్ననుంచి తప్పించుకోవచ్చు. రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకి చూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టు గా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతి అసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు. ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతులను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది.నిజానికి మెరిట్ కూడా ఒక సామాజిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గది ఉందా, తల్లిదండ్రుల విద్యా స్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కనిపించినట్లు నటించడం; అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం; ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో, సమాజంలోని అన్నివర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తననుతాను చూసుకునే అద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది. అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీకాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు. అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆ షరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మగౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతే సమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం.రిజర్వేషన్లపట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన బిజెపి రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. కులం అవకాశాలను నిర్ణయించనీ సమాజం. అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య. భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత. వివక్ష లేని ఉపాధి.

- ఎడిటర్

ఉద్యమాల వేగుచుక్క బొల్లోజు అయోధ్య..

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే నాయకుడు
ఆయన ఆశయ సాధనకు ప్రతి కమ్యూనిస్టు నిబద్ధతతో పనిచేయాలి:
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 06 తెలంగాణ పవర్ : పేదలు, కార్మికులు, రైతులు, గిరిజనులు, అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడు బొల్లోజు అయోధ్య చిరస్మరణీయుడని, ఆయన మరణించి ఏడాది గడిచినా ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అయోధ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు.

గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రామానుజవరం గ్రామంలో బొల్లోజు అయోధ్య స్తూపాన్ని ఆవిష్కరించిన అనంతరం బాడిశా సతీష్ అధ్యక్షతన నిర్వహించిన ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కూనంనేని మాట్లాడుతూ, బొల్లోజు అయోధ్య సాధారణ నాయకుడు కాదని, ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి నిరంతరం పోరాటం చేసిన కమ్యూనిస్టు యోధుడని కొనియాడారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు ప్రాంతంలో గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని చెప్పారు. ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడికి చేరుకుని బాధితులకు అండగా నిలిచి, సమస్య పరిష్కారం అయ్యే వరకు వెనుదిరగని పోరాట యోధుడిగా ఆయన ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు.

నేటి యువత అయోధ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ప్రజల కోసం త్యాగం చేయడం, నిబద్ధతతో పనిచేయడం, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాడడం వంటి విలువలను ఆయన జీవితం నేర్పుతుందని తెలిపారు. ప్రజా ఉద్యమాలను నిర్మించడంలో, పార్టీని బలోపేతం చేయడంలో అయోధ్య చేసిన సేవలు భారత కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు.

ఆయన లేని లోటు పార్టీకి, ప్రజలకు ఎప్పటికీ తీరనిదేనని పేర్కొన్న కూనంనేని, అయోధ్య ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త మరింత నిబద్ధతతో ప్రజా పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఆయనకు అర్పించే గొప్ప నివాళి అని అన్నారు.

అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. షబీర్ పాషా మాట్లాడుతూ, అయోధ్యతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. మణుగూరు ప్రాంతంలో ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు ప్రజలు ముందుగా గుర్తు చేసుకునే నాయకుడు అయోధ్య అని అన్నారు. పార్టీ, కులం, మతం అనే తేడా లేకుండా ప్రతి పేద కుటుంబానికి అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడిగా ఆయన నిలిచిపోయారని కొనియాడారు.

అయోధ్య ప్రజా సేవా తపన, నిరాడంబర జీవనం, నిస్వార్థ పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల పక్షాన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్, కొత్తగూడెం మేయర్ మూగ గణేష్, పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అయోధ్య అభిమానులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



జగిత్యాల, ఆగస్టు 6 తెలంగాణ పవర్ : లయన్స్ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో, పద్మశాలి సేవా సంఘం జగిత్యాల వారి సహకారంతో రేకుర్తి కంటి వైద్యశాల ద్వారా గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 85 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, వారిలో 52 మందికి కంటి ఆపరేషన్ అవసరమని వైద్యులు గుర్తించారు. దీంతో డాక్టర్ భాస్కర్ మాడేకర్, లయన్స్ క్లబ్ సభ్యుడు చిదుర సురేష్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి వైద్యశాలకు చెందిన లయన్స్ ఉచిత బస్సు ద్వారా బాధితులను కరీంనగర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుండేటి గంగాధర్, కార్యదర్శి అడువల జ్యోతి, ట్రెజరర్ పోతు గణేష్, తాటిపాముల వినోద్ కుమార్, వడ్లగట్ట శంకర్, శ్రీరాముల సుదర్శన్ పాల్గొన్నారు. అలాగే లయన్స్ క్లబ్ సభ్యులు మనవూరి శ్రీనివాస్, చిలుక రాజన్న, చిలివేరి రాజ్‌కుమార్, సామల శ్రీహరి, అనుమల్ల విలాస్, బత్తుల ప్రదీప్, ధోపాటి దేవదాస్, బుర్ర కిరణ్‌తో పాటు పద్మశాలి సేవా సంఘం పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామం తల్లిపాల వారోత్సవాలు







పెద్దమునగాల అంగన్వాడి సెంటర్ నందు తల్లుల సమావేశము నిర్వహించటం జరిగింది.

పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని. 6నెలల నిండెంత వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.

తల్లిపాలు తాగిన పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది.

తల్లి పాలు అమృతంతో సమానం అని చెప్పటం జరిగింది.,ఈ కార్యక్రమంలో భాగంగా సామూహిక అన్నప్రాసనలు చేయడం జరిగింది.

ఈ కార్యే క్ర మంలో గ్రామ సర్పంచ ఓగల, మరియత్రి , ఉపసర్పంచ్ సుంకర. రాదాకృష్ణ,

×జణూ సూపరవైజర్ జ్యోతి మేడం , ఎఎ,ూాచీవీ ూాణఖ. ఆశాలు, అంగనవాడి టీచర్స్ పాల్గొన్నారు.,ైపమరీ స్కూల్ టీచర్స్ కూడా పాల్గొనటం జరిగింది

ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్
విద్యార్థుల హాజరు, బోధన, మౌలిక వసతులు, పాఠశాల నిర్వహణపై కలెక్టర్ ఆరా,
విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచన



నాగర్ కర్నూల్ తెలంగాణ పవర్ ప్రతినిధి ఆగస్టు 6 : నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని లింగాల మండలం అప్పాయిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతులు, బోధన నాణ్యత, హాజరు శాతం, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

తనిఖీలో భాగంగా ముందుగా పాఠశాల హాజరు నమోదును పరిశీలించిన కలెక్టర్ విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల హాజరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పూర్తి అంకితభావంతో బోధన నిర్వహించాలని, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధనా విధానాలను అమలు చేయాలని సూచించారు.

అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యాభ్యాసం, పాఠాల అవగాహన, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

పాఠశాలలోని మౌలిక వసతులు, తరగతి గదుల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వసతి గృహం, భోజనశాల నిర్వహణ, పరిసరాల పారిశుద్ధ్యం వంటి అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి సౌకర్యం నాణ్యతతో అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

పాఠశాల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఆ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా విద్యా ప్రమాణాల పెంపు, మెరుగైన ఫలితాల సాధన, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట గ్రామ సర్పంచ్ విజయకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘన నివాళులు...

సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలి...
నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎర్రవల్లి శ్రీనివాస్

సిద్దిపేట, ఆగస్టు 6: ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేటలో ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న, చైర్మన్ అనుమోజు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ నకిరేకంటి కిరణ్ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎర్రవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎర్రవల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల కోసం పాటను ఉద్యమ ఆయుధంగా మలిచిన మహనీయుడు గద్దర్ అని కొనియాడారు. నిరుద్యోగ ఉద్యమ కళాకారులమైన తాము గద్దర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజల పక్షాన పాటల ద్వారా ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సిద్దిపేటలో గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దాసు పిన్నింటి, రాష్ట్ర కమిటీ సభ్యులు కుంచం శ్రీనివాస్, పిల్లిట్ల బుజంగం, జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ చిన్నగుండవెల్లి, ఉపాధ్యక్షులు శ్యామ్ సుందర్, తునికి రాజు, పాకాల భూపతి, సంయుక్త కార్యదర్శులు బొల్లం రాజేష్, ధనరేఖ, ప్రచార కార్యదర్శి చిన్నగుండవెల్లి రాజు, కోశాధికారి కందకట్ల రాజు, సలహాదారులు ఇనుప సురేష్, శశిధర్ పిల్లిట్ల, కమిటీ సభ్యులు ఐరేణి రేణుక, బండ రాణి, అగిల్ల స్వాతి, శ్రీనివాస్, బొల్లం, పిన్నింటి బాబు, మచ్చ ఉషన్, రమేష్,ఎల్లం, బిక్షపతి విష్ణుతో పాటు పలువురు నిరుద్యోగ ఉద్యమ కళాకారులు పాల్గొన్నారు.



ఒక బిడ్డ 18 ఏళ్ల ఖర్చు 1.89 కోట్లా...

హైదరాబాద్, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)ప్రస్తుతం దేశంలో ప్రతీ ఒక్కటి ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో యువత పెళ్లిళ్లు అంటేనే ఆమడ దూరం పారిపోతున్నారు. ఇక పెళ్లిళ్లు చేసుకున్న వారు పిల్లలను కనాలంటేనే ఖర్చులు లెక్కేస్తున్నారు. ఒక్కరు ముద్దు, అసలే వద్దు అంటూ పిల్లల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వీడియో ఇప్పుడు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. భారత్‌లో ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచాలంటే ఎంత ఖర్చు అవుతుందనే అంశంపై కంటెంట్ క్రియేటర్ విఖ్యాత్ సింగ్ చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ప్రస్తుతం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఒక మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి.. పిల్లలు పుట్టి, 18 ఏళ్లు వచ్చే వరకు వారికి అయ్యే ఖర్చులను లెక్కించాడు.ఒక కుటుంబం ఒక్కో బిడ్డకు సుమారు రూ.1.39 కోట్లు వెచ్చించాల్సి వస్తుందని విఖ్యాత్ సింగ్ అంచనా వేశారు. ద్రవ్యోల్బణం, ఉన్నత విద్య ఖర్చులు, పెట్టుబడులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే ఈ మొత్తం కాస్తా.. రూ.2 కోట్లకు పైగా చేరవచ్చని పేర్కొన్నారు. గర్భధారణ, డెలివరీ, మెడికల్ టెస్టులు, మందులు వంటి ఖర్చులకు సుమారు రూ.3 లక్షలు అవసరమవుతాయని విఖ్యాత్ సింగ్ చెప్పారు. పుట్టిన తర్వాత తొలి 2 ఏళ్లలో డైపర్లు, టీకాలు, ఫుడ్, ఇతర అవసరాల కోసం మరో రూ.6 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్పారు.2 ఏళ్ల వయసు నుంచి 18 ఏళ్ల వరకు పిల్లల ఆహారానికి మొత్తంగా రూ.15 లక్షలు ఖర్చు పెట్టాలని విక్రాంత్ సింగ్ తెలిపారు. వారి విద్యకు ప్లే స్కూల్ నుంచి స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ట్రిప్స్ కలిపి ఇంకో రూ.33 లక్షలు అవసరమవుతాయని లెక్కించారు. ఇక ట్యూషన్లకు రూ.9 లక్షలు.. ఆరోగ్య సంరక్షణకు రూ.5.4 లక్షలు.. ఎంటర్‌టైన్‌మెంట్ కోసం రూ.9 లక్షలు.. బట్టలకు రూ.7.2 లక్షలు.. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు రూ.4 లక్షలు.. స్పోర్ట్స్, కల్చరల్ ఈవెంట్లకు రూ.8 లక్షలు.. రవాణాకు రూ.8 లక్షలు.. పిల్లలు పుడితే పెద్ద ఇంట్లో నివసించాల్సిన అవసరం వస్తుందని అందుకు అదనంగా అద్దెకు రూ.32.4 లక్షలు ఖర్చవుతుందని వివరించారు.ఈ క్రమంలోనే విఖ్యాత్ సింగ్ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విఖ్యాత్ సింగ్ చెప్పినట్లు పిల్లల పెంపకం ప్రస్తుతం ఆర్థికంగా ఎంతో భారంగా మారిందని కొందరు నెటిజన్లు అంగీకరిస్తూ పోస్టులు పెడుతున్నారు. కానీ మరికొందరు మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నారు. అన్నీ డబ్బుతోనే ముడిపెట్టకూడదని హితవు పలుకుతున్నారు. పిల్లలు ఇచ్చే ఆనందం, ప్రేమ, కుటుంబానికి వచ్చే సంతోషాన్ని ఎంత డబ్బుతో అయినా కొలవలేమని పేర్కొంటున్నారు. పిల్లల వల్ల కలిగే ఆనందానికి ఎలాంటి విలువ కట్టలేమని పలువురు నెటిజన్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు

కాంగ్రెస్ వైపు యువత మారుతోందా

హైదరాబాద్, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జెన్ జీకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో యువతను ఆకట్టుకునేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిస్తున్నారు. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి జెన్ జీ నేతలతో తరచూ సమావేశమవుతున్నారు. వారి సమస్యలను తెలంగాణలో పరిష్కరించడమే కాకుండా వారు ఎన్నికల్లో పోటీ చేసే వయసు విషయంలోనూ వయసును తగ్గించాలని ఇటీవల రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీని నిరసిస్తూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత ఆందోళనలతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదు. రాష్ట్రంలోనూ యువ ఓటర్లకు గాలం వేయాలన్న ప్లాన్ లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో సీనియర్ నేతలను పక్కన పెట్టి యువతకు సీట్లు కేటాయించేలా ఢిల్లీ పర్యటనలో పార్టీ హైకమాండ్ ను ఒప్పించనున్నారని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చట్టసభల్లో 'జెన్ జీ' యువతకు ప్రాతినిధ్యం పెరగాలని, పోటీ చేసే వయసును 25 ఏళ్ల నుంచి 21 ఏళ్లకు తగ్గించాలని కోరడం ద్వారా యువత దృష్టిని ఆకర్షిస్తున్నారు. భవిష్యత్ రాజకీయాల్లో యువత పాత్ర కీలకం అని ఆయన భావిస్తున్నారు. అయితే, విద్యార్థుల నైపుణ్యాలపై ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ చర్చకు దారితీశాయి.రేవంత్ రెడ్డి వ్యూహం మరియు ప్రాధాన్యతలు యువత వైపు ఇటీవల కాలంలో కనిపించడం రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. చట్టసభల్లో జెన్ జీ యువతకు అవకాశం కల్పించాలని ప్రతిపాదన ఈ నెలలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పెట్టనున్నారు. ఈ తీర్మానం తెలంగాణ అసెంబ్లీలో చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి బీజేపీని కూడా ఇరుకున పెట్టే ప్రయత్నంలో రేవంత్ రెడ్డి ఉన్నట్లు కనపడు?ది. ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 ఏళ్లకు కుదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో యువ నాయకులకు, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చే వారికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు తెచ్చేలా ఒత్తిడి తెచ్చే వ్యూహంలో రేవంత్ రెడ్డి ఉన్నారు. యువత ఆలోచనలకు అనుగుణంగా రాజకీయ వ్యూహాలు అమలు చేయడం ఇప్పుడు తెలంగాణలో రాజకీయంగా చర్చ జరుగుతుంది. ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ ను బలోపేతం చేయడమే కాకుండా దేశంలోని యువత మొత్తాన్ని కాంగ్రెస్ వైపు మళ్లించి వచ్చే ఎన్నికల నాటికి దేశంలోకాంగ్రెస్ పార్టీకి దగ్గర చేయాలన్న స్ట్రాటజీ రేవంత్ చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరుకున పెట్టేందుకు ఇది మరింత ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్న మోడీ-సిపిఐ

హైదరాబాద్,దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొడుతూ... దేశసంపదను అంబానీ , అదానీ లకు కట్టబెడుతున్నారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నరసింహ ఆరోపించారు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు 9 రోజుల పాటు పాదయాత్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్ బషీర్ బాగ్ చౌరస్తాలోని బాబు జగ్జీవన్ రాం విగ్రహం నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఈటీ నరసింహ మాట్లాడుతూ... కేంద్ర బిజెపి ప్రభుత్వం పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. నీట్ పరీక్ష వైఫల్యానికి నిరసనగా విద్యార్థులు ఆందోళన చేపడితే వారిపై కూడా అక్రమ కేసులు పెట్టారని విమర్శించారు. గత 12 ఏళ్లుగా దేశంలో అన్ని వర్గాల ప్రజలను ప్రధాని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ 9 రోజుల పాదయాత్రలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ , వారిని చైతన్యం చేస్తామన్నారు. సెప్టెంబర్ 1న ఢిల్లీ లో వేలాది మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఈటీ నరసింహ స్పష్టం చేశారు.

మయన్మార్ తో భారత్ స్వ్యాత్ డీల్

న్యూఢిల్లీ, ఆగస్టు 6, (న్యూస్ పల్స్) మయన్మార్ సరిహద్దుల్లో దశాబ్దాలుగా గుర్తించని వివాదాస్పద ప్రాంతాల పరిష్కారం కోసం భారత్ భూభాగ మార్పిడి ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. "సరిహద్దులో ఇంకా పరిష్కరించని కొన్ని ప్రాంతాలు ఉన్నాయి... ఆయా అంశాలపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి" అని తెలిపారు. మణిపూర్ సరిహద్దుల వెంబడి మయన్మార్‌తో భూ మార్పిడికి భారత్ సిద్ధమవుతోందన్న నివేదికలపై ఆయన స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. సరిహద్దు వివాదాలను పరిష్కరించడానికి చర్చలు జరుగుతున్నాయనే ఈ నివేదికలను ఆయన పరోక్షంగా అంగీకరించారు.దీనిపై అమెరికాకు చెందిన 'ది డిప్లొమాట్' పత్రిక కొద్ది వారాల కిందట కథనం ప్రచురించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మణిపూర్-మాయన్మార్ సరిహద్దులోని పిల్లర్ 65 నుంచి 68 మధ్య ఉన్న సుమారు 2.8 కిలోమీటర్ల పరిధిలోని 1.4 చదరపు మైళ్ల భూభాగాన్ని మార్పిడి చేసుకోవడం ద్వారా సరిహద్దు గుర్తించే ప్రక్రియను పూర్తి చేయాలని భారత ప్రభుత్వం ఒక ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు అధికారిక పత్రాలను ఉటంకిస్తూ జులై 17న సదరు పత్రిక నివేదించింది. భూ మార్పిడి కోసం ప్రతిపాదించిన ప్రాంతం మణిపూర్‌లోని చందేల్ జిల్లాలో, మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతంలో ఉన్న కబావ్ లోయకు ఆనుకొని ఉంది. మే 26, 2026 నాటి అధికారిక పత్రం ప్రకారం, సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియ మూడు నెలల్లో అంటే సుమారుగా ఆగస్టు నాటికి పూర్తి కావాల్సి ఉంది.భారత్, మయన్మార్‌లు అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం గుండా మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతం, చిన్ రాష్ట్రాల్లోకి ప్రవేశించే 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటున్నాయి. ఈ సరిహద్దులో మెజార్టీ ప్రాంతం కొండలు, అడవులతో నిండి ఉండి చొరబాట్లకు అనుకూలంగా ఉంటుంది. ఇరువైపులా చారిత్రాత్మకంగా ఒకే వర్గానికి చెందిన గిరిజన జాతులు నివాసం ఉంటున్నారు. కేంద్ర హోం శాఖ ప్రకారం.. పిల్లర్ల ద్వారా సుమారు 1,472 కిలోమీటర్ల సరిహద్దును నిర్ధారించారు. అయితే, ప్రధానంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని లోహిత్ సెక్టార్, మణిపూర్‌లోని కబావ్ లోయలో దాదాపు 171 కిలోమీటర్ల సరిహద్దు ఇంకా పరిష్కారం కాలేదు.'ది డిప్లొమాట్' ప్రకారం.. భారత్-మయన్మార్ సరిహద్దులో ఇంకా అపరిష్కృతంగా ఉన్న ప్రాంతంలో గుర్తింపు నిర్ధారణను వేగవంతం చేయడమే భూభాగ మార్పిడి వెనుక ఉద్దేశం. దీనివల్ల సరిహద్దు పొడవునా కంచె నిర్మాణానికి ఆటంకాలు తొలగిపోతాయి. తత్ఫలితంగా అక్రమ వలసలు, తిరుగుబాటుదారుల కదలికలు, ఇతర సరిహద్దు నేరాలను అరికట్టడానికి వీలు కలుగుతుంది.మయన్మార్ వెంబడి 1,643 కిలోమీటర్ల పొడవైన అంతర్జాతీయ సరిహద్దు కంచె ప్రణాళికను 2024లో భారత్ ప్రకటించింది. అదే సమయంలో 2018 నుంచి అమల్లో ఉన్న భారత్-మయన్మార్ సరిహద్దు స్వేచ్ఛా రాకపోకల విధానాన్ని కూడా రద్దు చేసింది. ఈ విధానం ప్రకారం.. సరిహద్దు సమీపంలో నివసించే గిరిజన వర్గాలు, బోర్డర్ పాస్ ఉపయోగించి వీసా లేకుండా ఒకరి భూభాగంలోకి మరొకరు 16 కిలోమీటర్ల వరకు ప్రయాణించడానికి అనుమతి ఉండేది.ప్రస్తుత భారత్-మయన్మార్ సరిహద్దును 1967 ద్వైపాక్షిక ఒప్పందం కింద నిర్వచించారు. కానీ దానిలోని కొన్ని భాగాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. అపరిష్కృత ప్రాంతాలను ద్వైపాక్షిక సరిహద్దు యంత్రాంగం ద్వారా నిర్ధారిస్తామని, ఇందులో భాగంగా తొమ్మిది పిల్లర్లు గుర్తించి, ఏర్పాటు చేస్తామని 2018లో పార్లమెంట్‌కు కేంద్రం తెలిపింది.మణిపూర్‌లోని అత్యంత సున్నితమైన ప్రాంతాల్లోని 64-68 పిల్లర్ల మధ్య ఉన్న మోల్చామ్ సెక్టార్, 75- 79 పిల్లర్ల మధ్య ఉన్న మోరే సెక్టార్, 88-95 మధ్య ఉన్న చోరో ఖునౌ సెక్టార్ కీలకమైనవి. మయన్మార్‌తో విస్తృతమైన సరిహద్దు వివాదం ఏదీ లేదని, కేవలం తొమ్మిది పిల్లర్లు మధ్య ప్రాంతాలపై మాత్రమే ద్వైపాక్షిక యంత్రాంగాల ద్వారా పరిష్కరిస్తున్నామని భారత్ తరుచూ చెబుతోంది.అయితే, పొరుగు దేశాల మధ్య భూభాగ మార్పిడి అసాధారణమైంది ఏమీ కాదు. 2015లో భారత్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన భూ సరిహద్దు ఒప్పందం ద్వారా న్యూఢిల్లీ తన భూభాగంలోని 111 ఎన్‌క్లేవ్‌లను ఢాకాకు బదిలీ చేసి, బదులుగా 51 బంగ్లాదేశ్ ఎన్‌క్లేవ్‌లను పొందింది. దీంతో 41 ఏళ్ల నాటి సరిహద్దు వివాదం ముగిసింది. అయితే, ఈ ప్రతిపాదన మణిపూర్‌లో ఇప్పటికే వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. 'ది డిప్లొమాట్' నివేదిక తర్వాత స్థానిక ఇంఫాల్ టైమ్స్ కథనం ప్రకారం.. మణిపూర్ సమగ్రతా సమన్వయ కమిటీ కేంద్రానికి తీవ్ర హెచ్చరికలు చేసింది. తమ రాష్ట్ర భూభాగంలో చిన్న భాగాన్ని కూడా మయన్మార్‌కు అప్పగించవద్దని, ఒకవేళ అటువంటి ప్రతిపాదనను అమలు చేస్తే, ప్రజా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని 'కొకొమి' స్పష్టం చేసింది

నాంపల్లి టూ లక్డీ కపూల్ వై ఆకారంలో బ్రిడ్జి

హైదరాబాద్, ఆగస్టు 6, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నడిబొడ్డున ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు మరో కీలక ఫ్లైఓవర్ నిర్మాణం కానుంది. నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి హెచ్ఎండీఏ డీపీఆర్ రెడీ చేస్తోంది. 1.45 కిలోమీటర్ల పొడవుతో 3 లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌ను అసెంబ్లీ వెనుక నుంచి నిర్మించనుండగా.. లక్డీకాపూల్ వద్ద ఇది మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ వైపులకు విడిపోయేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర కోర్ ఏరియాలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గే అవకాశం ఉందిహైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీగా ఉండే నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కోర్ సిటీలో వై ఆకారంలో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణానికి సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తుది దశకు చేరుకుంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) రూపొందిస్తున్న ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ ఫ్లైఓవర్ నాంపల్లిలోని సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీ సమీపం నుంచి పబ్లిక్ గార్డెన్, అసెంబ్లీ వెనుక భాగం మీదుగా రైల్వే ట్రాక్ వెంట లక్డీకాపూల్ వరకు నిర్మించనున్నారు. మొత్తం 1.45 కిలోమీటర్ల పొడవుతో మూడు లేన్ల వన్‌వే ఫ్లైఓవర్‌గా దీన్ని డిజైన్ చేస్తున్నారు. లక్డీకాపూల్ చేరుకున్న తర్వాత ఫ్లైఓవర్ 2 మార్గాలుగా విడిపోయి వై ఆకారాన్ని సంతరించుకోనుంది. ఇందులో ఒక శాఖ దాదాపు 400 మీటర్ల మేర 2 లేన్లతో మాసబ్‌ట్యాంక్ వైపు ఇప్పటికే ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానం కానుండగా.. మరో శాఖ సుమారు 530 మీటర్ల మేర 2 లేన్లతో ఖైరతాబాద్ వైపు రోడ్డుకు కలుస్తుంది.దీంతో నాంపల్లి నుంచి వచ్చే వాహనాలు ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద ఆగకుండా నేరుగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నాంపల్లి-లక్డీకాపూల్ మార్గంలో 3 ప్రధాన ట్రాఫిక్ సిగ్నళ్లు ఉండటంతో రోజంతా తీవ్ర ట్రాఫిక్ నెలకొంటోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో ట్రాఫిక్ ఆంక్షల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఫ్లైఓవర్ నిర్మాణం ట్రాఫిక్ ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుందని అధికారులు భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించి ట్రాఫిక్ అంచనాల కోసం ప్రత్యేక కన్సల్టెన్సీ సంస్థతో సర్వే నిర్వహించగా.. ప్రస్తుతం టోపోగ్రఫీ సర్వే తుది దశలో ఉంది. పిల్లర్ల నిర్మాణం, డౌన్ ర్యాంపులు, ప్రభుత్వ భూముల అవసరం, రైల్వే అనుమతులు, అంచనా వ్యయం వంటి అంశాలతో కూడిన డీపీఆర్‌ను త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే నాంపల్లి, లక్డీకాపూల్, మాసబ్‌ట్యాంక్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

సిటలో 56 శాతమే పూర్తయిన డిజిటైజేషన్

హైదరాబాద్, ఆగస్టు 6 (న్యూస్ పల్స్)తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియ రాఎఖీ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలానికి దారితీసింది. 2002 నాటి ఓటర్ల డేటాబేస్, జీహెచ్ఎంసీ డోర్ నంబర్లు, ఆధార్ ఆధారిత మ్యాపింగ్ ప్రక్రియలో చోటుచేసుకున్న వ్యత్యాసాల కారణంగా దాదాపు 10 శాతం మంది ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితా నుంచి గల్లంతయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఫారమ్‌ల డిజిటైజేషన్ మందకొడిగా సాగుతుండటం, అసెంబ్లీ నియోజకవర్గాల వ్యాప్తంగా లక్షలాది మందికి బిఎల్వోల ద్వారా నోటీసులు రావడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఈ డేటా క్రోడీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చివరి క్షణంలో ఫ్యామిలీ సర్టిఫికెట్లు, వారసత్వ ధ్రువీకరణలను వేగంగా జారీ చేసే ప్రక్రియను ప్రారంభించింది. తెలంగాణ ఐటీ , రెవెన్యూ యంత్రాంగం ద్వారా మీ-సేవ కేంద్రాల్లో ఈ సర్టిఫికెట్లను అందుబాటులోకి తెచ్చినప్పటికీ, దరఖాస్తు చేసుకున్న ఓటర్లు ప్రాసెస్ పూర్తి కాక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అత్యధికంగా ఓట్ల తొలగింపు నోటీసులు రావడం, డిజిటైజేషన్ నమోదు కేవలం 56 శాతానికే పరిమితం కావడం నగర జనాభాను తీవ్ర అయోమయంలోకి నెట్టిందిఈ తీవ్ర విమర్శలు మరియు క్షేత్రస్థాయి విఫలతలపై కాంగ్రెస్ అధిష్టానం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లు బూత్ లెవెల్ ఏజెంట్లతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఓటర్ల ఓట్లను సక్రమంగా నమోదయ్యేలా చూడటంలో పర్యవేక్షణ లోపించిందని, ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్ల హక్కులకు భంగం కలగడం సరికాదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు , నాయకుల పనితీరుపై హైకమాండ్ క్లాస్ తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కొన్ని కీలక నియోజకవర్గాల్లో పక్కా వ్యూహంతో కుట్రలు జరుగుతున్నాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ బలమున్న సాంప్రదాయ ఓటర్లను, బహుజన, మైనారిటీ , నిరుపేద ఓటర్లను లక్ష్యంగా చేసుకుని విపక్షాలు, కొన్ని వర్గాలు కుట్రపూరితంగా పేర్లు తొలగించేలా బిఎల్వోల స్థాయిలోనే తప్పుడు రికార్డులు క్రియేట్ చేస్తున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు అలర్ట్‌గా ఉండాలని, ఏ ఒక్క అర్హత కలిగిన ఓటు కూడా పోకుండా కాపాడుకోవాలని ఆదేశించారు.రాష్ట్రంలో నెలకొన్న ఈ ప్రత్యేక పరిస్థితులు, హైదరాబాద్ నగరంలో నత్తనడకన సాగుతున్న ప్రాసెస్, క్షేత్రస్థాయి ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. తెలంగాణలో సర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ డెడ్‌లైన్‌ను ఆగస్టు 10వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రత్యేక షెడ్యూల్‌ను సవరించింది. కేంద్ర సీఈవో కార్యదర్శి నవీన్ కుమార్ స్వయంగా హైదరాబాద్ వచ్చి డోర్-టు-డోర్ సర్వేను, నియోజకవర్గాల వారీ డేటాను రీ-వెరిఫై చేయాల్సిందిగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈ ఓటర్ల డేటా సమరం తెలంగాణ రాజకీయంలో కాంగ్రెస్ , ప్రతిపక్షాల మధ్య సరికొత్త వేడిని రగిల్చింది. ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ సర్టిఫికెట్ల సహాయంతో తొలగించిన ఓటర్లు తమ హక్కును తిరిగి పొందుతారా లేదా ముసాయిదా జాబితా నాటికి భారీ స్థాయిలో ఓట్ల కోత తప్పదా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న షాద్ నగర్ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ వై. రవీందర్ యాదవ్

జయశంకర్ ఆశయాల మార్గంలో కేసీఆర్

కేసీఆర్ అభివృద్ధితోనే జయశంకర్ ఆశయ సిద్ధి

2028 తరువాత మళ్లీ మేమే

జయశంకర్ ఆశయాలను సంపూర్ణం చేస్తాం

షాద్ నగర్,తెలంగాణ ఉద్యమ సాధనతో ప్రొఫెసర్ జయశంకర్ సార్ తో కలిసి పోరాడిన కేసీఆర్ అనంతరం ఆయన ఆశయాల సాధన కోసం నిరంతర కృషి చేశారని షాద్ నగర్ బీఆర్ఎస్ సీనియర్నేత కేశంపేట మాజీ ఎమ్మెల్యే వై. రవీందర్ యాదవ్ అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక న్యూ సిటీ కాలనీలోని పార్క్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఎన్నో చోట్ల కేసీఆర్, జయశంకర్ కలిసి ముందుకు నడిచారని గుర్తు చేశారు. షాద్ నగర్ నియోజకవర్గానికి కూడా ఉద్యమంలో భాగంగా ఈ ఇద్దరు పలుమార్లు వచ్చారని అన్నారు. జయశంకర్ సార్ తెలంగాణ సాధన ద్వారా ఏ అభివృద్ధిని కోరుకున్నారో అలాంటి అభివృద్ధిని ముఖ్యమంత్రిగా పదేళ్లపాటు కేసీఆర్ బ్రహ్మాండంగా అందించారని అన్నారు. 2028 తర్వాత తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఆయన ఆశయాలను సంపూర్ణం చేస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, వ్యవసాయం, విద్యుత్, సాగునీటి సమస్యలను తీర్చడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని అన్నారు. కేసీఆర్ తో పాటు ఉద్యమానికి వన్నెతెచ్చిన ఆచార్య జయశంకర్ సార్ ఎక్కడ ఉన్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆయన ఆశీస్సులు ఎప్పటికీ తెలంగాణ ప్రజలపై ఉండాలని ఆకాంక్షిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాల్ నాయక్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ చైర్మన్ మన్నె కవిత నారాయణ, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, పార్టీ అధ్యక్షులు నటరాజన్, లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, శారద శేఖర్, జయలక్ష్మి కిషోర్, గౌస్ జానీ, పిన్నమోని గోపాల్, ఎస్పీ శివ, మాజీ కౌన్సిలర్లు వెంకట్రాం రెడ్డి, జూపల్లి శంకర్, యుగంధర్, కానుగు అంతయ్య, శ్రీనివాస్ గౌడ్, నంద కిషోర్, చిన్న యాదగిరి, సర్పంచ్ జెట్ట కుమార్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ పట్వారీ, నాయకులు నక్కల వెంకటేష్, బిక్షపతి, భాను శర్మ, నందిగామ శ్రీనివాస్, ప్రవీణ్, ప్రేమ్ కుమార్ గౌడ్, నవీన్, విష్ణు, రవీందర్, ఇర్ఫాన్, దొడ్డి రవీందర్, శేఖర్, రాఘవేందర్, గుండు అశోక్, కంది రాఘవేందర్, పవన్ సింగ్, పాండు, రామకృష్ణ రెడ్డి, వినోద్, చీపిరి సాయి, సిద్దు యాదవ్, వెంకటేష్, శీలం శ్రీకాంత్, రాజశేఖర్, సంజు నాయక్, శ్రీకాంత్, ప్రవీణ్, రఘు, నవీన్ గౌడ్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహింపు

వికారాబాద్ ,జిల్లా కేంద్రంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తిదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, సామాజిక సంస్థలు ఘనంగా నివాళులర్పించాయి. ఈ సందర్భంగా జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన త్యాగాలను, ఉద్యమానికి అందించిన అపూర్వ సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన అందించిన మేధోపరమైన దిశానిర్దేశం, ఉద్యమానికి ఇచ్చిన స్ఫూర్తి చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తిగా ఆయనను గుర్తుచేసుకుంటూ, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం జయశంకర్ సార్ ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని నాయకులు ఆకాంక్షించారు.

ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ హైవేపై రోడ్డు ప్రమాదం..

తల్లి, కొడుకు మృతి



ఖమ్మం రూరల్, ఆగస్టు 06 : ఖమ్మం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఒక కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై దంసలాపురం సమీపంలోని మున్నేరు వంతెన వద్ద గురువారం ఉదయం చోటుచేసుకున్న ఈ దుర్ఘటనలో తల్లి, కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడగా, అతడి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులు చింతకాని మండలం గాంధీనగర్ గ్రామానికి పావబత్తిని సుజాత (38), పావబత్తిని పవన్ కుమార్ (17) వారుగా గుర్తించారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన పావబత్తిని నరసింహారావు అనే వ్యక్తి తన భార్య, కొడుకుతో కలిసి హైదరాబాద్‌కు కారులో బయల్దేరారు. మున్నేరు వంతెన పై నుండి ప్రయాణం చేస్తున్న సమయంలో హైదరాబాద్ వైపు నుండి వస్తున్న డీసీఎంను అదుపుతప్పి బలంగా ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో సుజాత, పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన నరసింహారావును ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి విచారణ చేపట్టారు

నేరేడుగొమ్ము- కలకొండతండా బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



చందంపేట, ఆగస్టు 06 : రూ.2 కోట్ల గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నేరేడుగొమ్ము ? కలకొండతండా బీటీ రోడ్డు (బ్యాలెన్సింగ్ వర్క్) నిర్మాణానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. ముఖ్యంగా రైతులు తమ పంటలను పొలాల నుండి మార్కెట్‌కు వేగంగా తరలించేందుకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగపడుతుందని, వ్యవసాయ ఖర్చులు తగ్గడంతో పాటు సమయం కూడా ఆదా అవుతుందన్నారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, గర్భిణీలు, వృద్ధులు, అత్యవసర వైద్య సేవలు పొందాల్సిన ప్రజలు ఆసుపత్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, గ్రామ సర్పంచ్ పులికంటి సుధాకర్, మాజీ జడ్పీటీసీ కేతావత్ బాలు నాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ బైరెడ్డి కొండల్ రెడ్డి, మాజీ ఎంపీటీసిలు సీనియర్ నాయకుడు యుగేందర్ రెడ్డి, గిరి యాదయ్య, గడ్డం వెంకటయ్య, పరిసర గ్రామాల సర్పంచులు, కొప్పుల సురేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎలిజర్ల శ్రీను, వార్డు మెంబర్లు, రామావత్ మోహన్ పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో అతిక్ అహ్మద్ కుమారుడు అబాన్ మృతి.. మరో ముగ్గురికి గాయాలు

గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ కుమారుడు అబాన్ (21) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతడితోపాటు కారులో ప్రయాణిస్తున్న ఇంకో స్నేహితుడు కూడా మరణించగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ పరిధిలో గురువారం జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లో పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్. రాజకీయ నాయకుడిగానూ గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడిపై అనేక కేసులు నమోదయ్యాయి. తన అనుచరులతో హత్యలు, బెదిరింపులు వంటి ఘటనలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో 2023లో అతిక్ శతృవులు అతడిని అతి సమీపం నుంచి కాల్చి చంపారు.అతిక్ చిన్న కొడుకైన అబాన్ అహ్మద్.. స్నేహితులతో కలిసి ప్రయాగ్‌రాజ్ నుంచి ఝాన్సీకి వైట్ హ్యుండాయ్ క్రెటా కారులో బయల్దేరాడు. జైలులో ఉన్న తన సోదరుడిని కలుసుకునేందుకు గురువారం వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. ఒక జంతువు అడ్డురావడంతో దానిని తప్పించేందుకు కారు డ్రైవర్ ప్రయత్నించాడు. అయితే, కారు అతివేగంతో ఉండటంతో అదుపుతప్పి, పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అతిక్ అహ్మద్‌తోపాటు, అతడి స్నేహితుడు సోను కూడా మరణించారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. స్థానికులు, పోలీసులు కారులో గాయపడ్డ ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే అబాన్, అతడి స్నేహితుడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో ఇద్దరి మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడ్డవారికి చికిత్స కొనసాగుతోంది. ఈ ఘటనలో వాహనం చాలా వరకు ధ్వంసమైందని పోలీసులు తెలిపారు.ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. అతీక్‌తోపాటు, అతడి కుటుంబానికి కూడా తీవ్రమైన నేర చరిత్ర ఉంది. 2023లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అతిక్ కొడుకు అసద్ అహ్మద్ మరణించాడు. అతడి రెండో కొడుకు అలీ అహ్మద్ ఝాన్సీ జైలులో ఉన్నాడు. అతడిపై 10 వరకు క్రిమినల్ కేసులున్నాయి. అతడిని కలిసేందుకు అబాన్ వెళ్తుండగానే ఈ రోడ్డు ప్రమాదం జరిగింది.

ఇండియా-నేపాల్ సరిహద్దులో ఉద్రిక్తత..

భారత సిబ్బందిపై రాళ్లదాడి చేసిన నేపాలీలు

ఇండియా-నేపాల్ సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినట్లు ఆలస్యంగా వెల్లడైంది. సరిహద్దులో భద్రతా విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌బీ (సశస్త్ర సీమా బల్)కు చెందిన సిబ్బందిపై నేపాల్‌కు చెందిన కొందరు గ్రామీణులు రాళ్ల దాడి చేశారు. ఈ ఘటన ఆగష్టు 2న జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. ఇండియా-నేపాల్ సరిహద్దు అయిన బిహార్‌లోని వెస్ట్ చంపారన్ వద్ద ఎస్ఎస్‌బీ సిబ్బంది, ఉన్నతాధికారులు భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. జూలై 31న సరిహద్దులో నేపాల్ వైపు ఉన్న సుస్తా గ్రామస్తులు మట్టితో ఒక నిర్మాణం చేపట్టారుఅయితే, అది నేపాల్ వైపు నుంచి ఇండియాలోకి వచ్చింది. అంటే, ఇండియా భూభాగంలో ఆ నిర్మాణం చేపట్టారు. దీనిపై ఎస్ఎస్‌బీ దళాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. దీంతో ఈ అంశంపై ఇటు భారత సిబ్బంది, అటు నేపాల్ ఆర్మ్‌డ్ ఫోర్స్ కలిసి చర్చించి, ఒక ఒప్పందానికి వచ్చారు. ఆ నిర్మాణాన్ని ఆపేయాలని నిర్ణయించారు. అయితే, అక్కడ ఏ నిర్మాణం చేపట్టకూడదనే ఒప్పందం ఉన్నప్పటికీ, మళ్లీ కొందరు నేపాల్ గ్రామస్తులు ఆగష్టు 2న తిరిగి నిర్మాణం ప్రారంభించారు. దీన్ని ఎస్ఎస్‌బీకి చెందిన భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో నేపాల్‌కు చెందిన గ్రామస్తులు భారత సిబ్బందిపైకి రాళ్లు రువ్వారు. దాదాపు 150 నుంచి 200 మంది గ్రామస్తులు కలిసి భారత సిబ్బందిపైకి రాళ్లు, కర్రలతో దాడికి యత్నించారు.ఈ నేపథ్యంలో నేపాల్ గ్రామస్తులపై ఎస్ఎస్‌బీ, రాంపూర్వ, 21వ బెటాలియన్ కమాండర్‌కు చెందిన ఉన్నతాధికారి అవ్దేష్ కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమపై నేపాల్ గ్రామస్తులు దాడికి దిగారని ఆరోపిస్తూ వాల్మీకి నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.



కేసీఆర్ పోరాటం జయశంకర్ సారు ఆరాటం వల్లే తెలంగాణ వచ్చింది : హరీశ్ రావు

సిద్దిపేట ప్రాంతంతో ప్రొఫెసర్ జయశంకర్‌కు ఎంతో అనుబంధం ఉండేది? తెలంగాణ వచ్చింది అంటే కేసీఆర్ పోరాటం జయశంకర్ సారు ఆరాటం వల్ల వచ్చిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ఆయన విగ్రహానికి హరీశ్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఏ రోజు కూడా జై తెలంగాణ అనలేదు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఈరోజు తెలంగాణ సీఎంగా ఉన్నాడు. గోదావరిలో 380 ఒఅ ల నీళ్లు కేసీఆర్ నాయకత్వంలో హక్కుగా సాధించాం. 968 ఒఅ గోదావరి నదీ జలాలలో మన హక్కుగా రావలసింది అని పోరాటం చేశారు. కేసీఆర్ గోదావరిలో 830 ఒఅ నీళ్లు హక్కుగా సాధించారు. కేసీఆర్ మిగతా 130 ఒఅ ల నీళ్ల కోసంలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 3 సంవత్సరాలు అయినా ఒక్క అనుమతి కూడా తీసుకురాలేదన్నారు.చరిత్రలో అనుమతి ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలని రివ్యూ చేయాలని మొదటిసారి వచ్చింది. గతంలో 18 వరకు మీటింగులు అయ్యాయి ఎజెండాలో తెలంగాణ ప్రాజెక్టుల పునర్ నమీక్షించాలని తెలంగాణ ప్రాజెక్టులు రద్దు చేయాలని ఎప్పుడూ రాలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ ప్రాజెక్టులను ఎప్పుడు వ్యతిరేకించినా తెలంగాణ దాన్ని తిప్పి కొట్టింది.. అన్ని అనుమతులు సాధించింది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటిసారి ఎజెండాలోకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వానికి ప్రాజెక్టుల మీద నీళ్ల మీద సోయి లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ఎజెండా మార్పించాలని హరీశ్ రావు హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మీటింగ్ ను బహిష్కరించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కడుతున్న బనకచర్లను ఎందుకు తెలంగాణ ప్రభుత్వం అడ్డుకోలేక పోతుంది.నమ్మక్క సారక్క ప్రాజెక్ట్ 47 ఒఅ హైడ్రాలజీ క్లియరెన్స్ వచ్చాక తెలంగాణ ప్రభుత్వం ఎందుకు వదులుకుంటుంది అనేది తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఖీఖీఖ స్టేజ్ 2కు సమ్మక్క సారక్క నీళ్లు అవసరం. వరంగల్ నల్గొండ ప్రాంతాలకు నీళ్లు ఇచ్చే ప్రాజెక్టును ఎందుకు వదులుకుంటున్నారని ప్రశ్నించారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టు కట్టే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఆనాడు ఎజెండాలో లేదన్నారు..ఢిల్లీలో జరిగే మీటింగ్ లో ఉంది..మీటింగుకు హాజరు కాము అన్నారు?హాజరయ్యారు.. సంతకం పెట్టా అన్నారు సీఎం..కోర్టులో కేసులు వేసి అట్టర్ ప్లాప్ అయ్యారు.. కోర్టులో రిట్ కేస్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి వెయ్యడానికి రావడం లేదని హరీశ్ రావు మండిపడ్డారు.



తమిళనాడులో మళ్లీ 'తమిళ్ తాయ్ వాళ్తు' వివాదం..

గవర్నర్‌కు 21 మంది ఎంపీల లేఖ

తమిళనాడులో రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలాపన ప్రొటోకాల్ మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. తిరునెల్వేలిలో జరిగిన మనోన్మణీయం సుందరనార్ యూనివర్సిటీ 33వ కాన్వకేషన్‌లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందని ఎంపీలు ఆరోపించారు. కార్యక్రమంలో ముందుగా 'వందే మాతరం', అనంతరం జాతీయ గీతం, ఆ తర్వాత మూడో స్థానంలో 'తమిళ్ తాయ్ వాళ్తు' ఆలపించడాన్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. రాష్ట్ర గీతాన్ని ఈ విధంగా మూడో స్థానంలో ఉంచడం తమిళ ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా.. ఆ గీత రచయిత సుందరనార్‌ను కూడా అవమానించడమేనని లేఖలో పేర్కొన్నారు.ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం, ఎంపీ కార్తి చిదంబరం, చిరుతైగల్ కచ్చి నేత తిరుమావలవన్‌తో పాటు మొత్తం 21 మంది ఎంపీలు గవర్నర్‌కు సంయుక్తంగా లేఖ రాశారు. గత ఐదు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం.. ప్రభుత్వ, విశ్వవిద్యాలయ కార్యక్రమాల్లో ప్రారంభంలో 'తమిళ్ తాయ్ వాళ్తు', ముగింపులో జాతీయ గీతం ఆలపించాలని వారు డిమాండ్ చేశారు. వరుసగా మూడోసారి ప్రొటోకాల్‌లో మార్పులు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంటూ, భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావులేకుండా రాజ్‌భవన్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీలు విజ్ఞప్తి చేశారు.



విడాకులిచ్చే అధికారం మతపరమైన సంస్థలకు లేదు.. తేల్చి చెప్పిన మధ్యప్రదేశ్ హైకోర్టు..



న్యూఢిల్లీ: మసీదు కమిటీ ఫత్వాపై మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివాహాన్ని రద్దు చేసే అధికారం ఏ మతపరమైన సంస్థలు, కమిటీలు, లేదా సెమినరీలకు లేదని స్పష్టం చేసింది. కేవలం మసీదు కమిటీ జారీ చేసిన ఫత్వా ఆధారంగా వివాహ బంధం రద్దు అయినట్లు పరిగణించలేమని తేల్చిచెప్పింది. చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరించి రాజ్యాంగబద్ధమైన ఫ్యామిలీ కోర్టుల ద్వారానే విడాకులు పొందాల్సి ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా జస్టిస్ వివేక్ జైన్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.విచారణ సందర్భంగా భోపాల్ 'దారుల్-దఫా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా తన వివాహ బంధం రద్దు అయినట్లు ప్రకటించాలని కోరిన ఓ భర్త అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉంటుందని వెల్లడించింది.అయితే, విడాకులు కోరే వ్యక్తికి చట్టప్రకారం సంబంధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకులు పొందే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వివాహ రద్దు పిటిషన్ దాఖలు చేస్తే, దానిని సంబంధిత కోర్టు నిబంధనల ప్రకారం విచారిస్తుందని పేర్కొంది. కాగా, ఈ తీర్పు మతపరమైన ఫత్వాల చట్టబద్ధత, వివాహ రద్దు ప్రక్రియపై కీలకమైన స్పష్టతను ఇచ్చిందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

అత్యాచారం కేసు.. తెహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు..



తెహెల్కా మాజీ ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు శిక్ష పడింది. 2013లో నమోదైన లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు గోవా బెంచ్ కీలక తీర్పు వెలువరించింది. పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా కూడా విధించింది. అతడు రెండు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది.2013లో జూనియర్ సహోద్యోగినిపై అత్యాచారం చేసిన కేసులో తేజ్‌పాల్‌ను దోషిగా తేల్చిన బాంబే హైకోర్టు తాజాగా శిక్షను ఖరారు చేసింది. గతంలో ట్రయల్ కోర్టు ఈయనను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పును బాంబే హైకోర్టు రద్దు చేసింది. 2013లో గోవాలో జరిగిన ఒక కార్యక్రమంలో హోటల్ లిఫ్ట్‌లో తనపై తేజ్‌పాల్ లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఆరోపించారు. దీంతో అదే ఏడాది నవంబర్‌లో అతడిని అరెస్ట్ చేశారు.విచారణ అనంతరం 2021లో గోవా ట్రయల్ కోర్టు తేజ్‌పాల్‌ను నిర్దోషిగా ప్రకటించింది. అయితే ఆ తీర్పును గోవా ప్రభుత్వం బాంబే హైకోర్టులో సవాలు చేసింది. అప్పీల్‌ను విచారించిన హైకోర్టు ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేస్తూ తేజ్‌పాల్‌ను దోషిగా నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించిందికాగా, ఈ కేసులో తానే బాధితుడినని తేజ్‌పాల్ పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పూ చేయలేదని, తాను నిర్దోషినని పేర్కొంటూ ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని వెల్లడించారు. తీర్పు వెలువడిన అనంతరం మీడియాతో మాట్లాడిన తేజ్‌పాల్, 'నేను ఎలాంటి నేరమూ చేయలేదు. ఈ తీర్పుతో నేను ఏకీభవించడం లేదు. న్యాయం కోసం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాను' అని చెప్పారు.

అరుణాచల్‌ప్రదేశ్‌లో మళ్లీ భూకంపం

ఇటానగర్, ఆగస్టు 06: అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై దాని తీవ్రత 5.1గా నమోదయింది. ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కానీ జరగలేదని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. ఈ రోజు తెల్లవారుజాము 5.45 గంటలకు అప్పర సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు 116 కిలో మీటర్ల దూరంలో.. 11 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు వివరించింది.అయితే ఈ భూకంపానికి ముందు మూడు చిన్న ప్రకంపనలు చోటు చేసుకున్నాయని పేర్కొంది. అవి ఉదయం 3.40 గంటలకు 5 కిలోమీటర్ల లోతులో 2.8 తీవ్రతతో ఒకటి.. దీని తర్వాత 3.55 గంటలకు 3.2 తీవ్రతతో మరొకటి వచ్చిందని వివరించింది. అలాగే ఉదయం 4.34 గంటలకు 2.8 తీవ్రతో ఇంకొకటి వచ్చిందని తెలిపింది. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.మరోవైపు ఇదే రాష్ట్రంలోని షి యోమి జిల్లాలో బుధవారం భూకంపం సంభవించింది. ఇది 5.0 తీవ్రతతో వచ్చింది. ఈ జిల్లాకు ఈశాన్యంగా 60 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం నమోదైంది. ఇక్కడ కూడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. దేశంలోని ఈశాన్య ప్రాంతం భూకంపం జోన్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో తరచూ అత్యధికంగా భూ ప్రకంపనలు జరుగుతున్నాయి.



చింతలపూడిలో కుంకుమపువ్వు సాగు

ఏలూరు, ఆగస్టు 6 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కుంకుమ పువ్వు సాగు చేయాలని నిర్ణయించింది. కుంకుమ పువ్వు సాగుకు సంబంధించి చేసిన ప్రయోగాలు విజయవంతం కావడంతో సాగు దిశగా చర్యలు తీసుకుంటోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగు చేయాలని ప్లాన్ చేశారు. అనుమతులన్నీ రాగానే కుంకుమ పువ్వును సాగు చేసేందుకు 30 ఎకరాల భూమిని కేటాయించనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో కుంకుమ పువ్వు సాగు దిశగా అడుగులు పడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గతంలో ప్రయోగాత్మకంగా సాగు చేయగా మంచి ఫలితాలు రావడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి కేంద్రంగా కుంకుమ పువ్వు సాగు చేయనున్నారు. ఏపీ ప్రభుత్వం 30 ఎకరాల్లో కుంకుమ పువ్వు సాగుకు కేటాయించాలని భావిస్తోంది. వాస్తవానికి ముందు లంగసింగి ప్రాంతంలో కుంకుమ పువ్వు సాగు చేద్దామని భావించారు.. కానీ అక్కడ అనువైన భూమి లేకపోవడంతో చింతవల్లిలో సాగు చేయాలని నిర్ణయించారు.చింతపల్లిలో కుంకు పువ్వు సాగుకు సంబంధించి శాస్త్రవేత్తలు రెండేళ్లుగా చేస్తున్న ప్రయోగాలు విజయవంతం అయ్యాయి. ఈ ప్రాంతంలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలలో మూడు వేర్వేరు వాతావరణ పరిస్థితుల్లో సాగు చేయగా మంచి ఫలితాలు వచ్చాయి. చింతపల్లిలో కుంకుమ పువ్వు సాగుకు.. కృష్ణా జిల్లాకు చెందిన 'స్నాప్ గ్రీన్‌మ్యాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ ముందకు వచ్చింది. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందం కూడా చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు దక్కుతాయంటున్నారు. ఏపీ ప్రభుత్వం కుంకుమ పువ్వు సాగు కోసం కేటాయించే 30 ఎకరాల్లో.. 18 ఎకరాల్లో సాగు ఉంటుంది, 3 ఎకరాల్లో ఇండోర్ పర్యావరణ పరిరక్షణ, మిగిలిన 9 ఎకరాల్లో ప్రాసెసింగ్, పరిశోధన, శిక్షణ, పరిపాలనా భవనాలు వంటి వాటి కోసం కేటాయించారు.కుంకుమ పువ్వు సాగు పరిశ్రమ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసిన వారికి కూడా మంచి అనుభవం ఉంది అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ఈ అంశాలన్నీ పరిగణలోకి తీసుకుని చింతపల్లిలో కుంకుమపువ్వు సాగుకు అడుగులు వేస్తోంది. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సుగంధ ద్రవ్య బోర్డు, సేంద్రీయ ధృవీకరణ, ఉద్యానవన శాఖ నుంచి అనుమతులు రాగానే భూమిని అధికారికంగా కేటాయిస్తారు. దేశవ్యాప్తంగా కాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్? వంటి చల్లని ప్రాంతాల్లో ఎక్కువగా కుంకుమ పువ్వు సాగు చేస్తున్నారు. మనకు 100 టన్నుల డిమాండ్ ఉంటే.. దేశీయంగా కేవలం 3.46 టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తి 300 టన్నులు ఉంటే.. ఇరాన్?, స్పెయిన్ దేశాలు ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి.

తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఓట్లు మిస్

విజయవాడ, ఆగస్టు 6 ఆంధ్రప్రదేశ్ రాజకీయ క్షేత్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సంచలనం సృష్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.16 కోట్ల ఓటర్లలో ఏకంగా 44.89 లక్షల ఓటర్లు అంటే సుమారు 10.8 శాతం ఓటర్ల పేర్లను అధికారులు ముసాయిదా జాబితాలో అన్ కలెక్టబుల్ కేటగిరీ కింద తొలగించేందుకు సిద్ధం చేశారు. జులై 31న విడుదలైన ఈ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం.. రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 3.71 కోట్లకు పడిపోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర అలజడి రేపుతోంది.ఈ భారీ ఓట్ల గల్లంతు వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే.. 15.22 లక్షల మంది మరణించిన వారు కాగా, 22.99 లక్షల మంది శాశ్వతంగా నివాసం మారినవారు లేదా ఫారమ్‌లు సమర్పించని అన్ కలెక్టబుల్ కేటగిరీలో ఉన్నారు. మరో 7.37 లక్షల ఓట్లను ఒకే వ్యక్తికి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న డూప్లికేట్ ఓట్లుగా అధికారులు వర్గీకరించారు. ముఖ్యంగా రాయలసీమ , కోస్తా జిల్లాల్లో ఓట్ల రద్దు అత్యధికంగా నమోదైంది. నెల్లూరు జిల్లాలో అత్యధికంగా 2.91 లక్షల ఓట్లు, తిరుపతి జిల్లాలో 2.88 లక్షలు, కర్నూలులో 2.74 లక్షలు, అనంతపురంలో 2.48 లక్షలు, వైఎస్సార్ కడపలో 2.45 లక్షలు, విశాఖపట్నంలో 2.39 లక్షల ఓట్లు తొలగింపు లిస్టులోకి వెళ్లాయి.ఈ భారీ ప్రక్రియ వెనుక అసలేం జరుగుతోంది.. వీరంతా ఎటు పోయారనే ప్రశ్న అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఉపాధి, విద్య, వ్యాపార రీత్యా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లేదా ఇతర నగరాలకు శాశ్వతంగా వలస వెళ్లిన వారు క్షేత్రస్థాయి రీ-వెరిఫికేషన్ సమయంలో లభించకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. రాజకీయ నష్ట కోణంలో చూస్తే, ఈ ఓట్ల గల్లంతు ప్రభావం రెండు ప్రధాన పార్టీలపై పడే అవకాశం ఉంది. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తూ సొంత ఊళ్లకు వచ్చి ఓటేసే మైగ్రెంట్ ఓటర్లు వైఎస్సార్‌సీపీ లేదా టీడీపీ మద్దతుదారులనే లెక్కలు పార్టీల వద్ద ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తమ మద్దతుదారుల పేర్లు పొరపాటున ఈ 44 లక్షల జాబితాలో చేరాయేమోనని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమితో పాటు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల వేళ ఈ ఓట్ల వ్యత్యాసం గెలుపోటములను శాసించే స్థాయిలో ఉంది.ఎన్నికల సంఘం, సీఈఓ వివేక్ యాదవ్ స్పష్టం చేసిన దాని ప్రకారం, ఇది కేవలం ముసాయిదా మాత్రమే. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు హక్కునూ నోటీసు, విచారణ లేకుండా తొలగించబోమని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆగస్టు నెల అంతా క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ప్రక్రియ నడుస్తోంది. తమ పేరు పొరపాటున గల్లంతైతే ఫారమ్-6 సమర్పించి, సరైన ఆధారాలు చూపిస్తే అక్టోబర్ 3న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో మళ్లీ పేరు చేరుతుందని ఈసీ వెల్లడించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో గ్రామీణ మరియు పట్టణ పరిధిలో బూత్ లెవెల్ ఏజెంట్లను అలర్ట్ చేసిన కూటమి, వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి నియోజకవర్గంలో రద్దయిన ఓట్ల జాబితాను రీ-వెరిఫై చేసే పనిలో పడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ విలువైనదే అయినందున, అసలైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చూసేందుకు పొలిటికల్ పార్టీలు డిజిటల్ క్యాంపెయిన్లు, డోర్-టు-డోర్ వెరిఫికేషన్లను ముమ్మరం చేశాయి.

రాజమండ్రిలో మెడికల్ విద్యార్థినిపై కారు ఎక్కించిన దారుణం

రాజమండ్రి ఏవీ అప్పారావు రోడ్డు ప్రసాదిత్యా మాల్ వద్ద పార్కింగ్ వివాదంలో జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రియాంక (28)పై నామవరానికి చెందిన ఇద్దరు యువకులు కారు ఎక్కించారు. తీవ్రంగా గాయపడిన బాధితురాలు హైదరాబాద్ ఆసుపత్రిలో బ్రెయిన్ డెడ్ కాగా, మద్యం మత్తులో ఈ దారుణానికి పాల్పడిన నిందితులను ప్రకాష్ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఐఎన్ఎస్ డేగ ఇక జ్ఞాపకమేనా !!

విశాఖపట్టణం, ఆగస్టు 6,ఆరు దశాబ్దాలకు పైగా విశాఖపట్నానికి విమానంలో వచ్చిన ప్రతి ప్రయాణికుడూ సాధారణ విమానాశ్రయంలో దిగలేదు... భారత నౌకాదళ వైమానిక స్థావరంలోనే అడుగుపెట్టాడు. మీ విమానం ల్యాండ్ అయిన అదే రన్‌వేపై ప్రతి ఉదయం హాక్ జెట్ శిక్షణ విమానాలు గర్జిస్తూ ఆకాశంలోకి దూసుకెళ్లేవి. టెర్మినల్ పక్కనే జలాంతర్గాములను వేటాడే హెలికాప్టర్లు నిలిపిన హ్యాంగర్లు కనిపించేవి. పౌర విమానాలు, యుద్ధ విమానాలు... రెండూ ఒకే రన్‌వేను పంచుకోవడం విశాఖకు మాత్రమే ప్రత్యేకమైన దృశ్యం. "విశాఖ అంటే అంతే" అన్నట్టే వైజాగ్ ఎయిర్‌పోర్ట్ ఆపరేషన్స్ సాగాయి.ఆగస్టు 1, 2026న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భోగాపురంలోని "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని" ప్రారంభించారు. ఆగస్టు 17నుంచి అన్ని కమర్షియల్ విమాన సర్వీసులు అక్కడికి మారనున్నాయి. దీంతో ఆరు దశాబ్దాలుగా ప్రయాణికులను ఆహ్వానించిన ఐఎన్ఎస్ డేగా ఇకపై పూర్తిగా నావికాదళ విమాన స్థావరంగానే కొనసాగనుంది.ఈ సందర్భంగా ఒక ప్రశ్న సహజంగానే వస్తుంది. ఐఎన్ఎస్ డేగా కథ ఎక్కడ మొదలైంది? ఇప్పుడు దాని భవిష్యత్తు ఎలా ఉండబోతోంది?యుద్ధ అవసరాల కోసం నిర్మించిన రన్‌వే... తర్వాత నౌకాదళ గూటిగా మారిందిఎఐౌ డేగా చరిత్ర భారత నౌకాదళంతో కాదు... రెండో ప్రపంచ యుద్ధంతో ప్రారంభమవుతుంది. ఆ సమయంలో భారత తూర్పు తీరంలో సైనిక కార్యకలాపాలకు మద్దతుగా రాయల్ ఎయిర్ ఫోర్స్ నావల్ ఆర్మమెంట్ డిపో సమీపంలో ఒక ఎయిర్‌స్ట్రిప్ నిర్మించింది. యుద్ధం ముగిసిన తర్వాత ఆ రన్‌వే దాదాపు నిరుపయోగంగా మారిపోయింది. 1962లో పౌర విమానాల కోసం మళ్లీ తెరిచినా ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో సేవలు పలుమార్లు నిలిచిపోయాయి.భారత నౌకాదళం తన వైమానిక విభాగాన్ని విస్తరించే క్రమంలో 1972 డిసెంబరులో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించింది. తొలుత ఎఐౌ సర్కార్స్ నుంచి హెలికాప్టర్ యూనిట్‌ను నడిపింది. నాలుగేళ్లలో పౌర విమానాశ్రయం పక్కనే హెలిప్యాడ్లు, హ్యాంగర్లు ఏర్పడ్డాయి. 1986లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖ విమానాశ్రయాన్ని అధికారికంగా భారత నౌకాదళానికి అప్పగించింది.భారత పౌర విమానయాన చరిత్రలో ఇది అత్యంత అరుదైన నమూనా. సాధారణంగా సైనిక స్థావరాల్లో పౌర విమానాల కోసం చిన్న ఎన్‌క్లేవ్ ఉంటుంది. విశాఖలో మాత్రం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం నావికాదళ స్థావరం లోపలే నడిచింది. 1991 అక్టోబర్ 21న వైస్ అడ్మిరల్ లక్ష్మీనారాయణ రామ్‌దాస్ దీనిని అధికారికంగా "ఐఎన్ఎస్ డేగా" గా ప్రారంభించారు.డేగా" అంటే మనకు తెలిసిన గద్ద జాతి పక్షే. శక్తి, వేగానికి ప్రతీకగా నిలిచే ఆ పేరు... తర్వాతి కాలంలో హాక్ జెట్లు, కామోవ్ హెలికాప్టర్లు, నిఘా విమానాలకు కేంద్రంగా ఎదిగి ఈ స్థావరానికి సరిగ్గా సరిపోయింది.2000ల దశకం ఐఎన్ఎస్ డేగా రూపురేఖలనే మార్చేసింది. 2007లో 10 వేల అడుగుల కొత్త రన్‌వే అందుబాటులోకి వచ్చింది. వెంటనే రాత్రి వేళల్లో కూడా విమాన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. గోవా నుంచి కామోవ్ హెలికాప్టర్లతో కూడిన ఐఎన్ఏఎస్-333 "ఈగిల్స్", తర్వాత హాక్ జెట్ శిక్షణ విమానాలతో ఎఐౌ-551 "ది ఫాంటమ్స్" ఇక్కడికి వచ్చాయి. 2009 నాటికి ఐదు నౌకాదళ స్క్వాడ్రన్లు, యుద్ధ నౌకల విమాన యూనిట్లు, నెలకు 550కుపైగా కమర్షియల్ విమానాలు... అన్నీ ఒకే రన్‌వేను పంచుకునే స్థాయికి ఐఎన్ఎస్ డేగా చేరుకుంది.విశాఖ ప్రజలకు ఇది రోజువారీ జీవితంలో భాగమైపోయింది. పైన హాక్ జెట్ గర్జిస్తే అది సాధారణ దృశ్యమే. కానీ ఎఐౌ డేగా కేవలం విమానాశ్రయం మాత్రమే కాదు. ప్రతి ఏడాది బంగాళాఖాతంలో విరుచుకుపడే తుపాన్లు, వరదల సమయంలో సహాయక చర్యల్లో ముందుండేది. తూర్పు నౌకాదళ కమాండ్ అడ్వెంచర్, స్కైడైవింగ్ కార్యక్రమాలకు కూడా ఇదే కేంద్రంగా నిలిచింది.ఈ ద్వంద్వ వినియోగ వ్యవస్థ విశాఖకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. అయితే అదే కాలక్రమంలో దాని బలహీనతగా కూడా మారింది. మూడు వైపులా కొండలు ఉండటంతో విమానాలు ఒకే దిశలో టేకాఫ్, ల్యాండింగ్ చేయాల్సి వచ్చేది. గంటకు దాదాపు పది విమానాలకే పరిమితి. అదీ కాక పౌర విమానాల షెడ్యూల్ మొత్తం నౌకాదళ శిక్షణ సమయాలకు అనుగుణంగానే ఉండేది. ఇంతలో విశాఖ నగరం విస్తరించింది. ఉక్కు పరిశ్రమలు, ఫార్మా కంపెనీలు, పోర్టు ఆధారిత పెట్టుబడులతో దేశంలో వేగంగా ఎదుగుతున్న నగరంగా మారింది. 1990ల అవసరాలకు సరిపోయే విమానాశ్రయం... 2020ల విశాఖ అవసరాలకు సరిపోలేని పరిస్థితి ఏర్పడింది.ఎన్నో సంవత్సరాలుగా ప్రతిపాదనలకే పరిమితమైన భోగాపురం విమానాశ్రయం చివరకు సాకారమైంది. సుమారు ?4,700 నుంచి ?5,600 కోట్ల వ్యయంతో పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మించిన "అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం", విశాఖకు ఈశాన్యంగా విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో సిద్ధమైంది. 3,800 మీటర్ల రన్‌వేతో భారీ వైడ్‌బాడీ విమానాలు దిగే సామర్థ్యం దీనికి ఉంది. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా, భవిష్యత్తులో నాలుగు కోట్ల వరకు విస్తరించేలా దీన్ని రూపకల్పన చేశారు. డీజీసీఏ లైసెన్స్, బీసీఏఎస్ భద్రతా అనుమతులు, అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ హోదా... అన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 17 నుంచి దేశీయ, అంతర్జాతీయ కమర్షియల్ విమానాలన్నీ భోగాపురం నుంచే నడవనున్నాయి. విశాఖకు చిరునామాగా ఉన్న"ఎజి" ఐఏటీఏ కోడ్ కూడా అక్కడికే మారుతుంది.ఈ మార్పుతో మూతపడేది పౌర ప్రయాణికుల టెర్మినల్ మాత్రమే. నావికాదళ స్థావరం మాత్రం యథావిధిగా కొనసాగుతుంది. సైనిక విమానాలు, నౌకాదళ కార్యకలాపాలు, విపత్తు సహాయక చర్యలు, ప్రభుత్వ ప్రత్యేక విమానాలు, వీఐపీ రాకపోకలు... అన్నింటికీ ఐఎన్ఎస్ డేగా సేవలందిస్తూనే ఉంటుంది. అంతేకాదు, కమర్షియల్ విమానాల ఒత్తిడి తొలగిపోవడంతో విశాఖ గగనతలంపై భారత నౌకాదళానికి పూర్తి నియంత్రణ లభిస్తుంది. ఇప్పటి వరకు పౌర విమానాల షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని చేయాల్సి వచ్చిన అడ్జస్ట్‌మెంట్లు ఇక అవసరం ఉండవు. శిక్షణ విమానాలు పెంచడం, నౌకాదళ కార్యకలాపాలను విస్తరించడం, అత్యవసర పరిస్థితుల్లో మరింత వేగంగా స్పందించడం... ఇవన్నీ మరింత సులభమవుతాయి.ఐఎన్ఎస్ డేగా ఎప్పుడూ శాశ్వత పౌర విమానాశ్రయంగా లేదు. భౌగోళిక పరిస్థితులు, కాలానుగుణ అవసరాలు కలిసి తాత్కాలిక ఏర్పాటుగా మొదలైన వ్యవస్థ... మూడు దశాబ్దాలకు పైగా విశాఖ నగరానికి సేవలందించింది. దాని వల్ల విశాఖ దేశవ్యాప్తంగా మెరుగైన వైమానిక అనుసంధానం పొందింది. అదే సమయంలో పరిమిత సామర్థ్యం, యుద్ధ విమానాలతో రన్‌వే పంచుకోవాల్సిన పరిస్థితిని కూడా భరించింది. ఇప్పుడు ఆ రెండు పాత్రలు విడిపోతున్నాయి. విశాఖకు ప్రపంచస్థాయి అంతర్జాతీయ విమానాశ్రయం లభిస్తోంది. ఐఎన్ఎస్ డేగా మాత్రం తన అసలు స్వరూపానికి తిరిగి వెళ్తోంది... తూర్పు నౌకాదళానికి పూర్తిస్థాయి వైమానిక కేంద్రంగా. ఇకపై ఆ పాత రన్‌వేపై హాక్ జెట్ గర్జిస్తూ ఆకాశంలోకి ఎగిరినప్పుడు... దాని వెనుక టేకాఫ్ కోసం బోయింగ్-737 విమానాల వరుస కనిపించదు అంతే

వారసుడిగా విమర్శలు - లోకేష్ పీనితీరుపై పొగడ్తలు



విజయనగరం, ఆగస్టు 6, విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం ముగించుకుని తిరుగుపయనమైన సందర్భంలో.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భుజం తట్టి "శభాష్ లోకేశ్! చాలా బాగా పనిచేస్తున్నావు.. ఇదే వేగం, స్ఫూర్తితో ముందడుగు వేయి" అని అభినందించడం కేవలం ఒక సాధారణ వీడ్కోలు మర్యాద మాత్రమే కాదు. భారత రాజకీయాల్లో సీనియర్ నేతల గుర్తింపు పొందడం అంత సులభం కాని తరుణంలో, ప్రధాని స్థాయిలో లభించిన ఈ ఆత్మీయ ప్రశంసా వాక్యాలు నారా లోకేశ్ పాలనా నైపుణ్యానికి, క్రమశిక్షణతో కూడిన పట్టుదలకు దక్కిన జాతీయ స్థాయి ముద్రగా చెప్పుకోవచ్చు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారసుడిగా రాజకీయ అరంగేట్రం చేసిన ప్రారంభంలో లోకేశ్ తీవ్ర ప్రతికూల విమర్శలను, సోషల్ మీడియా ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నారు. వారసత్వం అనే నైతిక బరువుతో ప్రయాణం ప్రారంభించిన ఆయన, విమర్శలను ఎదురుదాడికి సాకుగా మార్చుకోకుండా పరిపాలనా సామర్థ్యం, పక్కా కార్పొరేట్ మేనేజ్‌మెంట్ స్కిల్స్‌తో తనను తాను మలచుకున్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి చొచ్చుకెళ్లడం, మంగళగిరి నియోజకవర్గంలో రికార్డు విజయం సాధించడమే కాకుండా.. కార్నెగీ మెల్లన్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల విద్యాభ్యాసం అందించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని పాలనలో సమర్థవంతంగా వినియోగిస్తూ ఒక ప్రొఫెషనల్ లీడర్‌గా ఎదిగారు.విజయనగరం భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం, యోగాంధ్ర ప్రపంచ రికార్డు కార్యక్రమాల నిర్వహణ, లేదా గతంలో ప్రధాని మోదీ ఏపీ పర్యటనల సమన్వయం ఇలా ప్రతి ఈవెంట్‌లోనూ లోకేశ్ చూపించిన ఆర్గానైజింగ్ స్కిల్స్ ప్రధానిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్, గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌తో పాటు విద్యాశాఖలో తెచ్చిన సంస్కరణలపై ప్రధాని మోదీ ముందే సమాచారం పొంది ఉండటంతోనే.. వేదికపై పబ్లిక్‌గా లోకేశ్‌ను ప్రశంసించారని స్పష్టమవుతోంది. ఇది ఒక యువ నాయకుడి కష్టానికి, పారదర్శక కార్యాచరణకు దక్కిన ప్రతిఫలం అనుకోవచ్చు. వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించే ప్రధాని మోదీ గతంలో లోకేష్ ను కూడా విమర్శించారు. కానీ ఇప్పుడు అభినందిస్తున్నారు. ప్రధాని శభాష్ అని అనడం వెనుక లోకేశ్ సొంతంగా సంపాదించుకున్న గుర్తింపే ప్రధాన కారణం. ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల వికాస శాఖల మంత్రిగా గ్లోబల్ ఇన్వెస్టర్లను ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షించడంలో లోకేశ్ నిరంతరం విదేశీ ప్రతినిధులతో సమావేశమవుతూ చురుగ్గా పనిచేస్తున్నారు. పెట్టుబడుల సేకరణ, నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పనలో ఆయన చూపుతున్న వేగం జాతీయ స్థాయిలో కూడా చర్చనీయాంశమైంది. మరోవైపు విపక్షాలు చేసే రాజకీయ విమర్శలకు సైతం లోకేశ్ ఇప్పుడు సంయమనంతో, సమాచార ఆధారిత సమాధానాలు ఇస్తూ ఒక సీనియర్ స్టేట్స్‌మన్‌లా వ్యవహరిస్తున్నారు. పార్టీలో తండ్రి చంద్రబాబు నాయుడి పక్కన ఒక బలమైన రెండో శ్రేణి నాయకత్వంగా నిలబడటమే కాకుండా, ఎన్డీయే కూటమి సమన్వయంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. పవన్ కల్యాణ్ వంటి జనసేన అధినేతతో, బిజెపి కేంద్ర నాయకత్వంతో సౌహార్ధపూర్వక సంబంధాలను నిర్వహిస్తూ కూటమికి బలమైన ఆధారంగా నిలిచారు.సొంత ప్రయాణంలో తండ్రి నీడ నుంచి బయటకు వచ్చి, తనదైన శైలిలో పాలన సాగిస్తూ, శభాష్ అని ప్రధాని చేత పటించుకోవడం ఒక యువ నేతకు అతిపెద్ద పొలిటికల్ మైలురాయి. దేశంలోనే అత్యంత ప్రామిసింగ్ యంగ్ పొలిటీషియన్లలో ఒకరిగా ఎదిగిన లోకేశ్‌కు ప్రధాని ఇచ్చిన ఈ బూస్ట్, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, విద్యా వికాసంలో మరింత వేగాన్ని నింపడమే కాక.. జాతీయ స్థాయిలో ఆయన ప్రాధాన్యతను మరింత పెంచనుందనడంలో సందేహం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఎలా ఎదిగాడో...దానికి డబుల్ స్పీడ్ లో...



ఒంగోలు, ఆగస్టు 6, ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కష్టపడి పైకి వచ్చారు. ఎంత వేగంగా ఎదిగారో.. అంతే స్పీడ్ గా పతనమయ్యారు. ఒక బలహీనత ఆయన కెరీర్ ను ప్రమాదంలోకి నెట్టేసింది. మహిళలతో సంబంధాల కోసం ఉదయ్ కృష్ణారెడ్డి ఐపీఎస్ ఉద్యోగానికే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కేసులో ట్విస్ట్ ల మీద ట్విస్ట్ లు పోలీసుల విచారణతో వెదలయింది. ట్రెయినీ మహిళ ఐపీఎస్ తో మాత్రమే కాకుండా మరో మహిళతోనూ వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడయింది. తమ ప్రాంతానికి చెందిన మహిళ హైదరాబాద్ లో ఉండటం, ఆమెను లోబర్చుకున్నారన్న ఆరోపణలు ఉదయ్ కృష్ణారెడ్డిపై వినిపిస్తున్నాయి.... ట్రయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసు దర్యాప్తులో కీలక పురోగతి కనిపిస్తుంది. ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో కత్తి, రెండు ప్రేమలేఖలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వివాహితతో

దిగజారిన ఉదయ్ కృష్ణారెడ్డి

సంబంధం ఉన్నట్లు గుర్తించారు. బాధితురాలిని కలిసిన తర్వాత ఉదయ్‌కు వివాహిత దూరమైనట్లు కూడా కనుగొన్నారు. తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ అధికారిణిపై వేధింపుల కేసులో అరెస్టయిన ట్రెయినీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి సంబంధించి దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నగర మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్ జాదవ్ నేతృత్వంలో సాగుతున్న విచారణలో నిందితుడి విపరీత ప్రవర్తన, ఇతర సంబంధాలపై కీలక ఆధారాలు లభ్యమయ్యాయి... కేసులో భాగంగా సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు అశోక్‌నగర్‌లోని ఉదయ్ కృష్ణారెడ్డి గదిలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒక ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తో పాటు ఒక కత్తి, వేర్వేరు చేతిరాతలతో ఉన్న రెండు ప్రేమలేఖలను స్వాధీనం చేసుకున్నారు. ఈ లేఖల ఆధారంగా ఆరా తీయగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వివాహితతో ఉదయ్‌కు సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2014లో వివాహమైన సదరు మహిళ, 2023 నుంచి భర్తకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆమెకు ఉదయ్‌తో పరిచయం ఏర్పడినట్లు తెలిసింది. ఉదయ్ సూచన మేరకే ఆ మహిళ తన పాత ఉద్యోగాన్ని వదిలేసి, అశోక్‌నగర్‌లోని ఓ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో చేరినట్లు దర్యాప్తులో వెల్లడైంది. వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉందామని ఉదయ్ ప్రతిపాదించగా, చట్టబద్ధంగా విడాకులు రాకపోవడంతో ఆమె నిరాకరించినట్లు సమాచారం. ఈ కేసులో మరో కీలకమైన విషయం ఏమిటంటే.. ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధితురాలైన ట్రెయినీ ఐపీఎస్ అధికారిణిఆ వివాహితను కలిసి ఉదయ్ కృష్ణారెడ్డి విపరీత ప్రవర్తన, తనపై జరిపిన దాడుల గురించి వివరించారు. దీంతో అతడి నిజస్వరూపం తెలుసుకున్న ఆ మహిళ, అప్పటి నుంచి ఉదయ్‌కు దూరంగా ఉంటున్నట్లు పోలీసుల విచారణలో స్పష్టమైంది.

బాధితురాలి గదిలోకి ఉదయ్ బలవంతంగా ప్రవేశించి ఆమె ఫోన్‌ను లాక్కున్నట్లు కూడా పోలీసులకు బలమైన ఆధారాలు లభించాయి. శిక్షణ సమయంలోనూ ఉదయ్ కృష్ణారెడ్డి అతి కోపం, ప్రవర్తన కారణంగా తోటి అధికారులు మానసికంగా ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.ఈ కేసులో భాగంగా పోలీసులు ఇప్పటివరకు దాదాపు 20 మంది నుంచి వాంగ్మూలాలు సేకరించారు

స్పోర్ట్స్ న్యూస్

వైభవ్.. సచిన్ కంటే ఎక్కువ ప్రభావం చూపుతాడు: రాబిన్ ఉతప్ప

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కేవలం 15 ఏళ్ల వయసులోనే తన అద్భుతమైన బ్యాటింగ్ తో అందరి దృష్టిని ఆకర్షించాడు. అంతేకాక అతిపిన్న వయసులోనే అంతర్జాతీయ క్రికెట్ లో అరంగేట్రం చేసి.. ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ నేపథ్యంలో అతడిపై తరచూ మాజీ క్రికెటర్ పలు వ్యాఖ్యలు చేస్తుంటారు. తాజాగా ఈ చిచ్చర పిడుగుపై మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప సంచలన వ్యాఖ్యలు చేశాడు. వైభవ్ వైట్ బాల్ క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ కంటే కూడా వైభవ్ మరింత పెద్ద ముద్ర వేయగలడని ఉతప్ప అభిప్రాయపడ్డాడు. అయితే, ఈ అంశం రాబోయే కొన్నేళ్లపాటు అతడు ఎలా ఆడుతాడు అనే దానిపై ఆధారపడి ఉందని పేర్కొన్నాడు.ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఉతప్ప మాట్లాడుతూ.. వైభవ్‌లో అసాధారణ ప్రతిభ ఉందని, అయితే ఆ ఒక్కటే సరిపోదని స్పష్టం చేశాడు. గతంలో వినోద్ కాంబ్లీ, పృథ్వీ షా వంటి ఎంతోమంది యువ ఆటగాళ్లు అద్భుతమైన ఆరంభాలను దక్కించుకున్నప్పటికీ, ఆ తర్వాత సరైన మార్గదర్శకత్వం లేక కనుమరుగయ్యారని గుర్తుచేశాడు. వైభవ్ విషయంలోనూ అదే పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించాడు.వైభవ్‌కు రానున్న రోజుల్లో అసలైన పరీక్ష ఎదురుకానుందని ఉతప్ప పేర్కొన్నాడు. ప్రస్తుతం 15 ఏళ్ల ఈ కుర్రాడు.. తనలో ఉన్న దూకుడు, ఫామ్‌ను మరో ఐదేళ్ల పాటు అలాగే కాపాడుకోగలడా అనేది చూడాలన్నాడు. ప్రస్తుతం వైభవ్ డబ్బు కోసం ఎలాంటి వాణిజ్య ప్రకటనలకు వెళ్లకుండా పూర్తిగా క్రికెట్ మీదే దృష్టి పెట్టడం అభినందనీయమని ఉతప్ప ప్రశంసించాడు. భవిష్యత్తులో కీర్తి ప్రతిష్ఠలు, ఇతరత్రా వ్యాపకాలు, ఆకర్షణలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, ఆ సమయంలో సరైన మార్గదర్శకం చేసే తోడు అతనికి ఉండాలని అభిప్రాయపడ్డాడు. వైభవ్ ఎదుర్కొనే సవాళ్లను అధిగమించడంలో సరైన కోచ్‌లు, మెంటార్లు కీలక పాత్ర పోషించాలని తెలిపాడు.



గాయాల గండం.. భారత ఆటగాళ్లను వెంటాడుతున్న ఫిట్‌నెస్ సమస్యలు



శ్రీలంక పర్యటన కోసం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టు కొలంబోలో అడుగుపెట్టింది. అయితే, ఇటీవల ఇంగ్లండ్ పర్యటనలో ఎదురైన సమస్యే ఇప్పుడు కూడా జట్టును కలవరపెడుతోంది. అదే కీలక ఆటగాళ్ల గాయాల సమస్య. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఇప్పటికే సిరీస్ మొత్తానికి దూరం కాగా, కాలి కండరాల గాయంతో బాధపడుతున్న ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ రెండో టెస్టు సమయానికి అందుబాటులోకి వస్తాడో లేదో స్పష్టత లేదు. మరోవైపు యువ బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం నుంచి కోలుకోవడానికి బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో పునరావాసం పొందుతున్నాడు. సుదర్శన్ లేకుండానే భారత్.. లంక చేరుకుంది. ఈ ముగ్గురు మాత్రమే కాకుండా సెంట్రల్ కాంట్రాక్టులోని పలువురు కీలక ఆటగాళ్లనూ గాయాలు వెంబడిస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ నెగ్గిన తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా భారత్ తరఫున మరో మ్యాచ్ ఆడలేదు. బీసీసీఐ సీఓఈలో ఉండి ఫిట్‌నెస్ పెంచుకునేందుకు తన మకాంను బెంగళూరుకు మార్చుకున్నాడు. బౌలింగ్ వేగం పెంచే క్రమంలో మరో ఆల్‌రౌండర్, ఆంధ్ర కుర్రాడు నితీశ్ రెడ్డి తొడ కండరాల గాయంతో జట్టుకు దూరం అవ్వగా.. యంగ్ పేసర్ హర్షిత్ రాణా మోకాలు, కండరాల సమస్యలతో సతమతమవుతున్నాడు. భారత క్రికెటర్లు పదే పదే ఎందుకు గాయాల బారిన పడుతున్నారు? వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ ఎక్కడ దారితప్పుతోంది? అనేది చర్చనీయాంశమైంది.గతంలో మాదిరిగా క్రికెటర్లకు నిర్దిష్టమైన ఆఫ్ సీజన్ లభించడం లేదు. బిజీ క్యాలెండర్ వల్ల ఆటగాళ్లకు విశ్రాంతి కొరవడుతోంది. రికవరీ ప్రోటోకాల్స్, ట్రైనింగ్ ప్రోటోకాల్స్ మధ్య సరైన సమన్వయం లేకపోవడమే గాయాలకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇక, ఐపీఎల్ జరిగే రెండు నెలల సమయంలో ఆటగాళ్లు వారానికి రెండు, మూడు మ్యాచ్‌లు ఆడుతూ రికవరీ మోడ్‌లోనే ఉంటారు. ఆ సమయంలో ఫిట్‌నెస్ లెవెల్ పెంచుకునే కఠిన శిక్షణ జరగదు. మెగా లీగ్ ముగిసిన వెంటనే జాతీయ జట్టుకు ఆడేటప్పుడు వర్క్‌లోడ్ (పనిభారం) ఒక్కసారిగా పెరుగుతుంది. ఐపీఎల్ సమయంలో టెస్టులు లేదావన్డే క్రికెట్‌కు తగినట్టు ముందుగానే సిద్ధపడకపోవడం వల్ల శరీరానికి తీవ్ర ఒత్తిడి గురై ఆటగాళ్లు గాయపడుతున్నారు. ఇందుకు బుమ్రాను ఉదాహరణగా తీసుకోవచ్చు. మోకాలి నొప్పితోనే గత టీ20 వరల్డ్ కప్ ఆడిన బుమ్రా ఐపీఎల్‌లో పలు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. అతని వర్క్‌లోడ్‌ను క్రమంగా పెంచాల్సి ఉంటుందని ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ జయవర్దనే చెప్పాడు. ఈ కారణంగానే బుమ్రా బౌలింగ్‌లో వేగం కొద్దిగా తగ్గింది. ఐపీఎల్ తర్వాత అఫ్గానిస్థాన్‌తో సిరీస్‌కు, ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో టీ20తో టీ20లకు దూరంగా ఉండి విశ్రాంతి తీసుకున్నప్పటికీ కార్డిఫ్ వన్డేల్లో అతని మోకాలి గాయం తిరగబెట్టింది.టీ20 ఫార్మాట్‌కు, టెస్టు క్రికెట్‌కు కావలసిన ఫిట్‌నెస్ నైపుణ్యాలు వేర్వేరుగా ఉంటాయి. ఐపీఎల్‌లో రెండు నెలల పాటు హై-ఇంటెన్సిటీ పవర్ గేమ్ ఆడిన ఆటగాళ్లు, ఒక్కసారిగా అధిక శారీరక, మానసిక శక్తి అవసరమయ్యే టెస్టు క్రికెట్‌లోకి మారడం అత్యంత ప్రమాదకరమని గతంలో భారత జట్టుకు స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్‌గా పని చేసిన రాంజీ శ్రీనివాస్ చెబుతున్నాడు. ఇక, బిజీ షెడ్యూల్ వల్ల ఫార్మాట్‌లకు తగినట్టు శిక్షణ పొందేందుకు ఆటగాళ్లకు తగినంత సమయం దొరకడం లేదు. 2024లో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు చెన్నైలో ప్రీ-సీజన్ క్యాంప్ నిర్వహించగా, ప్రస్తుతం శ్రీలంక సిరీస్‌కు ముందు కొలంబోలో మాత్రమే క్యాంప్ నిర్వహించేలా ప్లాన్ చేశారు. సిరీస్‌ల మధ్య తగినంత రికవరీ సమయం లేకపోవడంతో ట్రైనర్లు సూచించిన ఫిట్‌నెస్ అంశాలపై శ్రమించే అవకాశం ఆటగాళ్లకు లభించడం లేదు.పలువురు ఆటగాళ్లు గాయాల నుంచి పూర్తిగా కోలుకోకముందే తొందరపడి జట్టులోకి వస్తున్నారు. గతంలో గాయపడిన ఆటగాళ్లు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఆడి తమ ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న తర్వాతనే సెలెక్టర్లు జాతీయ జట్టులోకి ఎంపిక చేసేవారు. కానీ ఇప్పుడు ఆ నిబంధనను కఠినంగా అమలు చేయడం లేదు.ప్రాథమిక ఫిట్‌నెస్ టెస్ట్ పాస్ కాగానే జట్టులోకి తీసుకుంటున్నారు తప్ప, ఆటగాడి మ్యాచ్ ఫిట్‌నెస్ నిజంగా మెరుగుపడిందా లేదా అన్నది చూడటం లేదు. లంక టూర్‌కు ముందుగా సుదర్శన్‌తో పాటు బుమ్రాను ఎంపిక చేసినా.. ఇద్దరూ ఫిట్‌నెస్ నిరూపించుకోవాలన్న షరతు పెట్టారు. తర్వాత బుమ్రాను సిరీస్ నుంచి తప్పించారు. బీసీసీఐ ఇప్పటికైనా టెస్టు ఆటగాళ్ల కోసం ప్రత్యేకంగా ప్రీ-సీజన్ క్యాంపులు ఏర్పాటు చేసి, కఠినమైన ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అమలు చేయకపోతే ముమ్ముందు మరిన్ని సిరీస్‌లకు కీలక ఆటగాళ్లు దూరమయ్యే ప్రమాదం ఉంది.

బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ ఇంటిపై పెట్రోల్ బాంబులతో దాడి..



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ ఇంటిపై దుండగులు పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. మాజీ ప్రధాని షేక్ హసీనా తాజాగా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో షకీబ్ వర్చువల్‌గా పాల్గొనడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. మోటర్ సైకిళ్లపై వచ్చిన కొందరు దుండగులు.. క్రికెటర్ ఇంటిపై బాంబులు వేశారు. భారీ శబ్ధంతో మంటలు రావడంతో స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. మంటను ఆర్పివేసి ఆస్తి నష్టం జరగకుండా చేశారు. ఆ సమయంలో షకీబ్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని పోలీసులు తెలిపారు. మళ్లీ ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. షకీబ్ ఇంటి వద్ద సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ తరఫున షకీబ్ ఎంపిగా గెలిచిన సంగతి తెలిసిందే. హసీనా ప్రభుత్వం రద్దు అయిన నేపథ్యంలో ఆతడి పదవి కూడా పోయింది.

మ్యాచ్ జరుగుతుండగా పడిన పిడుగు.. ప్లేయర్ మృతి





దక్షిణ థాయ్‌లాండ్‌లో ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా ఊహించని పరిణామం చోటుచేసుకుంది. గోలోక్ ఎఫ్ఏ కప్-2026 సెమిఫైనల్ మ్యాచ్ జరుగుతుండగా, హఠాత్తుగా మైదానంలో పిడుగు పడింది. ఈ విషాదకర ఘటనలో సోఫ్వాన్(24) అనే ఫుట్‌బాల్ ప్లేయర్ మృతి చెందగా, మరో 12 మంది ఆటగాళ్లు తీవ్రంగా గాయపడ్డారు. పిడుగుపడిన దృశ్యాలు కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.పిడుగుపాటుకు మైదానంలోనే కుప్పకూలిన సోఫ్వాన్‌కు వైద్య బృందం సీపీఆర్ చేసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే అతడు మరణించినట్లు తేలింది. ఇక పిడుగు పాటుకు గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దక్షిణ థాయ్‌లాండ్ సరిహద్దులో జరిగే ఫుట్‌బాల్ టోర్నమెంట్లలో ఇదే అతిపెద్ద టోర్నీ. ఇందులో థాయ్‌లాండ్ సహా మలేషియా ఆటగాళ్లు కూడా తలపడుతుంటారు. అయితే మ్యాచ్‌కు ముందు భారీ వర్షం కురిసిందని స్థానికులు చెబుతున్నారు. వర్షం ఆగిపోవడంతో మ్యాచ్ నిర్వహించామని, ఇలా హఠాత్తుగా పిడుగు గ్రౌండ్ లో పడుతుందని ఊహించలేకపోయామని, తమ సహచరుడైన సోఫ్వాన్‌ను కోల్పోవడం బాధాకరమని గోలోక్ క్లబ్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు.

అగార్కర్ వైదొలగక తప్పదా?

చీఫ్ సెలెక్టర్ రేసులో లక్ష్మణ్!



జాతీయ సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్‌పై ప్రస్తుతం తీవ్ర చర్చ నడుస్తోంది. వచ్చేనెలలో చీఫ్ సెలెక్టర్‌గా అతడి పదవీ కాలం ముగుస్తోంది. వాస్తవంగా అగార్కర్ పదవీకాలం గత జూన్‌లోనే ముగిసింది. కానీ బీసీసీఐ అతడికి మూడు నెలలు పొడిగింపు ఇచ్చింది. పరిస్థితులన్నీ సాధారణంగా ఉంటే వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచ కప్ వరకూ అజిత్ కొనసాగేవాడే. కానీ సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ వన్డేల నుంచి రిటైర్మెంట్ విషయమై ఇటీవల జరిగిన వివాదం అగార్కర్ పదవి పొడిగింపుపై బీసీసీఐని పునరాలోచనలో పడేసినట్టు సమాచారం. ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగిన వన్డేనే హిట్‌మ్యాన్‌కి చివరిదని, అనంతరం అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌కు కూడా వీడ్కోలు పలకనున్నాడని పుంఖాను పుంఖాలుగా వార్తలొచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన రోహిత్ తన ఫామ్‌పై వస్తున్న విమర్శలకు గట్టిగా బదులిచ్చాడు. మొత్తంగా..రోహిత్ రిటైర్మెంట్ వివాదం ఆసాంతం అగార్కర్ చుట్టూనే తిరగడం గమనార్హం.తెరపైకి లక్ష్మణ్ పేరు: అగార్కర్‌కు మరోసారి పొడిగింపులేదనే వార్తల నేపథ్యంలో..మరి చీఫ్ సెలెక్టర్‌గా ఎవరనే అంశంపై? చర్చ బయలుదేరింది. బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్సలెన్స్ (సీవోఏ) హెడ్‌గా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ పేరు బలంగా వినిపిస్తోంది. లక్ష్మణ్ ఎంపికే ఉత్తమంగా ఉంటుందని బీసీసీఐ పెద్దలు కూడా భావిస్తున్నట్టు తెలుస్తోంది. వీవీఎస్ అభిప్రాయాలను, సలహాలను సీనియర్లు రోహిత్, విరాట్ గౌరవిస్తారన్నది బోర్డు పెద్దల అభిప్రాయమట. మొత్తంగా..చీఫ్ సెలెక్టర్ విషయమై వచ్చేనెలలో జరిగే బీసీసీఐ వార్షిక సాధారణ సమావేశంలో బోర్డు నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఇక భారత జట్టుకు సంబంధించి లక్ష్మణ్ పేరు వినిపించడం ఇది తొలిసారేం కాదు. 2024లో ద్రవిడ్ హెడ్ కోచ్‌గా వైదొలిగాక..ఆ పదవికి లక్ష్మణ్ పేరు ప్రముఖంగా వినిపించింది.



మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇవ్వాలి: గంభీర్

శ్రీలంకతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో పాల్గొనేందుకు టీం ఇండియా ఇప్పటికే శ్రీలంక చేరుకుంది. ఆగస్టు 15 నుంచి ఆతిథ్య జట్టు, భారత్ మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. అంతకు ముందు శుక్రవారం నుంచి మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ జరుగుతుంది. ఈ క్రమంలో భారత ఆటగాళ్లకు కోచ్ గౌతమ్ గంభీర్ పలు కీలక సూచనలు చేశారు. "మన ముందు ఏ లక్ష్యం ఉందో మనకు తెలుసు. ఎందుకోసం ఆడుతున్నామో తెలుసు. పరిమితులను అధిగమించగలం. ఏదైనా సాధించగలం. అన్ని విభాగాల్లోనూ సత్తా చూపించగలం. బ్యాటింగ్, బౌలింగ్ ఏదైనా సరే.. ఆగస్టు 15 ఉదయం నుంచి మనకు ఎదురయ్యే ప్రతి సవాలుకు జవాబు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. ఇప్పటి నుంచే అందుకోసం సన్నద్ధమవుదాం. ఇప్పుడు మనతోపాటు ఇద్దరు కొత్త ప్లేయర్లు ఉన్నారు. వారిద్దరికి శుభాకాంక్షలు. సుర్యాంశ్ ఇక్కడి వరకు వచ్చేందుకు చాలా కష్టపడ్డావు. ఎప్పుడు అవకాశం వచ్చినా దేశం, కుటుంబం గర్వపడేలా చేస్తావని ఆశిస్తున్నా. ఇక అకిబ్ సబీకి స్వాగతం. గత సీజన్‌లో అదరగొట్టావు. జమ్ముకశ్మీర్ జట్టు రంజీ ట్రోఫీ నెగ్గడంలో కీలక పాత్ర పోషించావు. ఇక, మనతో పాటు పని చేసేందుకు శుభదీప్ ఘోష్ (ఫీల్డింగ్ కోచ్) వచ్చారు. చాలా జట్లతో గత కొన్నేళ్లుగా ఆయన పని చేశారు. ఆయన నిబద్ధత, ఎనర్జీ లెవల్స్ అద్భుతం. తన ప్రతిభతో మనందరిని లక్ష్యం దిశగా తీసుకెళ్తారని ఆశిస్తున్నా" అని గంభీర్ అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోని బిసిసిఐ సోషల్‌మీడియాలో షేర్ చేసింది.



జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను గురువారం మంత్రి శ్రీధర్ బాబు

ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20 నెలల కాలంలో తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 150 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు.

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులకు లోనవుతున్న తరుణంలో, ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా, జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు అత్యుత్తమ మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలక పాత్ర పోషించిందో, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఏఐ, డీప్‌టెక్, అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రం సిద్ధం చేస్తోందన్నారు.

హైదరాబాద్‌కు 16% జాతీయ వాటా

2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42 శాతానికి చేరుకోవడం హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో వాటికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన జీసీసీల ఏర్పాటులోనూ హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని పేర్కొన్నారు. దీంతో ఐటీ కేంద్రంగా మాత్రమే కాకుండా, అత్యాధునిక సాంకేతిక రంగాల్లోనూ ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు వేదికగా నగరం ఎదుగుతోందన్నారు.

జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుంది. ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది.

ఈ కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా ఆది శ్రీనివాస్ – 7. 50 లక్షల ఎల్ఓసి మంజూరు

సిరిసిల్ల, ఆగస్ట్ 06: సిరిసిల్ల పట్టణ పరిధిలోని ముష్టిపల్లికి చెందిన జడల సునీల్ కుమార్ పార్కిన్సన్స్ వ్యాధి తో బాధపడుతుండగా అతనికి అత్యవసర చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించారు. నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుండి 7,50,000 రూపాయల విలువ గల ఎల్వోసిను వైద్య ఖర్చుల కోసం వెంటనే



మంజూరు చేయించారు.

ఈ సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

ఆచార్య జయశంకర్ సార్ కు భారతరత్న ఇవ్వాలి

ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ వంగూరు జయశంకర్

నాగర్ కర్నూల్ (తెలంగాణ పవర్) ఆగస్టు : 6: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు మరువలేనివని ఆల్ ఇండియా ప్రొఫెసర్ జయశంకర్ ట్రస్ట్ చైర్మన్ వంగూరి జయశంకర్. ధనోజు అరవింద చారి అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉయ్యాలవాడ అంబేద్కర్ విగ్రహం దగ్గర. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ 92 వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంగన్వాడి కేంద్రానికి వెళ్లి అక్కడ చదువుతున్న చిన్నారులకు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంగూరు జయశంకర్ అరవింద చారి మాట్లాడుతూ.



ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. నీళ్లు నిధులు. నియామకాలలో జరుగుతున్న అన్యాయాన్ని నాటినుండి లెక్కలతో సహా ప్రజలకు మేధావులు విద్యావంతులను చైతన్యం చేసి నిరంతరం తెలంగాణ కోసం తపించేవాడని కొనియాడారు.

ప్రొఫెసర్ జయశంకర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రజానీకానికి ఆయన విజ్ఞప్తి చేశారు కేంద్ర ప్రభుత్వం. గుర్తించి తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో.

ఉయ్యాలవాడ ప్రభుత్వ స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనాథ్. రాజేందర్ రాధిక శ్రీలత నికిత స్వర్ణలత టీచర్స్ తో పాటు. ట్రస్ట్ ట్రెజరర్ మహేష్. సభ్యులు జంపుల్. కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంజన్. బాలస్వామి తదితరులు పాల్గొన్నారు..

లింగంపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

– అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

వేములవాడ, ఆగస్టు 06: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ వాణిశ్రీ మాట్లాడుతూ ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో అవసరమని, దాని ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు ఇవ్వడం వల్ల జీవితాంతం వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఇది బిడ్డకు మొదటి టీకా (వ్యాక్సిన్) లాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తల్లిపాలకు, డబ్బా పాలకు ఉన్న వ్యత్యాసాలను తల్లులకు క్షుణ్ణంగా



వివరించారు. శిశువుకు ఆరు నెలలు నిండేవరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల అటు తల్లికి, ఇటు బిడ్డకు ఇద్దరికీ అనారోగ్య సమస్యలు దరిచేరవని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సామ తిరుపతిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఆశా వర్కర్ జి. మారుత, విఓఏ లత, ఏఎల్ఎమ్ఎస్సీ కమిటీ సభ్యులు మమత, రేణ, ఆయాతో పాటు పిల్లల తల్లిదండ్రులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ఆచార్య జయశంకర్ జీవితం ఆదర్శప్రాయం

ఎస్ఓ టు జిఎం డి. వెంకటరామారావు

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 06 తెలంగాణ పవర్ : మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఓటు జిఎం డి. వెంకటరామారావు ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వమని, విద్యావేత్తగా, ఆలోచనాపరుడిగా, ఉద్యమకారుడిగా ఆయన చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆరు దశాబ్దాలపాటు ఆయన చూపిన అంకితభావం, ప్రజల్లో చైతన్యం నింపేందుకు చేసిన



భావజాల వ్యాప్తి, ఉద్యమానికి అందించిన దిశానిర్దేశం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని తెలిపారు. తెలంగాణ సమాజం పట్ల ఆయన కలలు కన్న అభివృద్ధి. సమానత్వం, ఆత్మగౌరవ విలువలను ఆచరణలోకి తీసుకురావడం ద్వారా మాత్రమే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతతో కృషి చేయాలని జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్ సందేశాన్ని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వి. మధన్ నాయక్,ఏజీఎం (ఐఈడీఎం) సి. హెచ్. రాంబాబు,ఏజీఎం (పర్సనల్)ఎస్. రమేష్, డీజీఎం (సివిల్) జి. శివప్రసాద్,క్వాలిటీ హెచ్వోడీ నాగరమేష్ ,పర్చేస్ హెచ్వోడీ సుదర్శన్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె. శ్రీనివాస్,డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ బి. శ్యామ్ ప్రసాద్, సీనియర్ పర్సనల్ అధికారులు కె. శ్రీనివాస్,వి. రామేశ్వర్ రావు, సీనియర్ ఎస్టేట్స్ అధికారి కె. స్వప్న ఇతర అధికారులు, మినిస్టీరియల్ సిబ్బంది ఉద్యోగులు పాల్గొన్నారు.

అనాధ బాలికలకు అండగా నిలిచిన పల్లా కిరణ్. కూతురు పల్లా హాసిని

ఖమ్మం బ్యూరో ఆగస్టు 6 : స్థానిక ఖమ్మం శాంతినగర్ ఏరియాలో శాంతి నగర్ బాల బాలికల స్కూల్ నందు చదువుకుంటున్న నిరుపేద బాలికలకు శానిటరీ పాడ్స్ లేక ఇబ్బంది పడుతున్న. తరుణంలో, అదేవిధంగా సెయింట్ మేరీస్ బాలికల హాస్టల్లో నివసిస్తున్న అనాధ బాలికలకు పాదరక్షలు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో పల్లా కిరణ్ దృష్టికి తీసుకురాగా తన కుమార్తె పల్లా హాసిని పుట్టినరోజు సందర్భంగా ఆ బాలికల మధ్యలో పుట్టినరోజు వేడుకలు జరుపుకొని బాలికలకు ఆరు నెలలకు సరిపడా శానిటరీ పాడ్స్ మరియు కాళ్లకు కొత్త చెప్పులు ఇచ్చి మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్.



గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు ఉదాహరణకు సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించుట, కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్స్ మరియు పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ, వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యవసర సరుకులు మరియు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు, నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు ప్రాథమిక మరియు ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం. వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు, అనాధ బాలబాలికలకు మరియు యువతకు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తు అండగా ఉండడం సంతోషంగా ఉన్నదని వ్యక్తం చేశారు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 3.50 కోట్ల విలువైన గంజాయి ధ్వంసం

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి ఆగస్టు 06 తెలంగాణ పవర్ : చట్టవిరుద్ధ మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పెద్ద ఎత్తున దాడిలో భాగంగా, ఎక్సైజ్ శాఖ మరో కీలక చర్య చేపట్టింది. ప్రభుత్వ అనుమతితో సుమారు రు 3.50 కోట్ల విలువైన 696.1 కిలోల స్వాధీనం చేసుకున్న గంజాయిని ధ్వంసం చేసింది. ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రకారం, ఈ గంజాయిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో నమోదైన 32 కేసుల్లో స్వాధీనం చేసుకున్నారు. వాటిలో కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ నుండి 316.07 కిలోలు, భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ నుండి 329.51 కిలోలు, పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్ నుండి 43.62 కిలోలు, మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ నుండి 6.90 కిలోలు ఉన్నాయి.

స్వాధీనం చేసుకున్న గంజాయిని తల్లాడ మండలం గోపాలపేటలోని ప్రభుత్వ అనుమతి పొందిన దహన కేంద్రంలో అధికారిక విధివిధానాలు, చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ధ్వంసం చేశారు.

ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ, మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకాలపై శాఖ కఠిన చర్యలు కొనసాగిస్తోందని, ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ ధ్వంస ప్రక్రియను ఖమ్మం డిప్యూటీ కమీషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు శాఖాధికారుల సమక్షంలో నిర్వహించారు.



సినిమా

సూర్య 47 దీపావళి బరికోసం సిద్ధం

తమిళ స్టార్ హీరో సూర్యకు ఇప్పటికే వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. రీసెంట్ గా జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య47' షూటింగ్‌ను పూర్తి చేశారు. చిత్రబృందం విడుదల చేసిన బీహైండ్ ది సీన్స్ వీడియోతో షూటింగ్ ముగిసిన విషయాన్ని అధికారికంగా వెల్లడించగా, ఇప్పుడు ఈ సినిమా విడుదల తేదీపై ఆసక్తికర చర్చ మొదలైంది. అందుతున్న సమాచారం ప్రకారం, 'సూర్య47'ను ఈ దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ వార్త నిజమైతే సూర్యకు ఇది వరుసగా మూడో థియేట్రికల్ విడుదలగా నిలవనుంది. ఇప్పటికే 'కరుప్పు'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన, ఆగస్టు 14న వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమా విడుదలైన కొద్ది నెలలకే 'సూర్య47' కూడా థియేటర్లలోకి వస్తే, ఒకే ఏడాదిలో వరుసగా మూడు సినిమాలతో అభిమానులను అలరించిన హీరోగా సూర్య నిలుస్తారు. అయితే దీపావళి బరిలో వెట్రిమారన్ దర్శకత్వంలో సిలంబరసన్ టి.ఆర్ నటిస్తున్న 'అరసన్' కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం కనిపిస్తోంది.



కొరియన్ కనకరాజు ట్రైలర్ విడుదల

వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు'. రితిక నాయక్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ఆగస్టు 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం మూవీ ట్రైలర్‌ను విడుదల చేసింది. థ్రిల్, హాస్యం, హారర్ అంశాలను మేళమించి మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. సత్య కీలక పాత్ర పోషిస్తున్న ఈమూవీకి తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రితికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు మంచి ఆదరణ పొందగా, ట్రైలర్‌లో ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ మరింత ఉత్సాహాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా యాక్షన్, హారర్ సన్నివేశాల్లో థమన్ సంగీతం సినిమాకు అదనపు బలంగా కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ అత్యంత




ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ట్రైలర్‌లో కనిపించిన విజువల్స్, సెట్స్, సాంకేతిక నాణ్యత సినిమాను భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు తెలియజేస్తున్నాయి.ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'కొరియన్ కనకరాజు' ఇప్పటికే మంచి పాజిటివ్ బజ్‌ను సొంతం చేసుకుంది. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు మరింత పెరిగాయి. హారర్, కామెడీ, యాక్షన్, ఎమోషన్‌లతో కూడిన పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.

9న మహేశ్ బాబు పుట్టిన రోజు



సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని చూస్తున్నారు. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది.

టాక్సిక్ ట్రైలర్ 8న గ్రాండ్‌గా విడుదల



కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ (మరియు మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్)యుక్తంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.



రెండు భాగాలుగా అల్లు,అట్లీల రాకా మూవీ



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం. ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844